మన స్థాయిని బట్టి మన మాటలు ఉండకూడదు.. మన మాటలకే ఒక స్థాయి ఉండాలి..

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

పూర్తి వివరాలకు

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంచిక 44 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | ఆగస్టు 12, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## సగర్వంగా హర్ ఘర్ తిరంగా

- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ పోస్ట్



2లో

# పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి



● పెండింగ్ భూసేకరణ పనులు త్వరగా పూర్తి ● మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు ● అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్,ఆగస్టు 11 :** హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశంచేశారు. ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మెట్రో పనులకు వీలైనంత త్వరగా టెండర్ పక్రియ ప్రారంభించాలని సూచించారు. పాతబస్తీ మెట్రో

మిగతా2లో...


## విషాదాన్ని మిగిల్చిన కొలంబియా భూకంపం

- 132కు చేరిన మృతుల సంఖ్య
- శిథిలాల కింద పెద్ద సంఖ్యలో ప్రజలు
- సహాయక చర్యలు ముమ్మరం చేసిన ప్రభుత్వం



2లో

## జేపీసీ పరిశీలనకు ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు



**న్యూఢిల్లీ,ఆగస్టు 11 :** వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎలాంటి చర్చలు లేకుండానే పలు బిల్లు లపై మోడీ ప్రభుత్వం ఆమోద ముద్ర వేయించుకుంటుంది. సోమవారం లోక్ సభలో విదేశీ విరాళాల

మిగతా2లో...

## రేవంత్ షెల్ కంపెనీల బాగోతం త్వరలోనే బండారం బయటపెడతాం

- సిఎం సోదరులంతా పెద్దపెద్ద కంపెనీ ఓనర్లు: కెటిఆర్



**హైదరాబాద్,ఆగస్టు 11 :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులంతా పెద్ద పెద్ద కంపెనీలకు యజమానులవుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఉద్యోగి కూడా లేకుండా కొత్తకొత్త కంపెనీలు ఏర్పాటుచేస్తున్నారని విమర్శించారు.సీఎం సోదరులు చిన్నచిన్న ఇంటి అడ్రస్‌లతో పెద్దపెద్ద కంపెనీలు రిజిస్ట్రేషన్ చేయించారు. అలాంటి ఊరుపేరు లేని కంపెనీలకు రాష్ట్రప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన 5 ఎకరాల భూమి కేటాయించింది. అనుముల కొండల్‌రెడ్డి టెసరాక్ కంపెనీ ఛైర్మన్ అని లింక్‌డిన్ ప్రొఫైల్‌లో పెట్టుకున్నారు. సీఎం మరో సోదరుడు జగదీశ్‌రెడ్డి కాంట్రాక్టులు చేసుకుంటున్నారు. సీఎం బామ్మర్ది సృజన్‌రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని

మిగతా2లో...



## జినోమ్ వ్యాలీలో 'యామ్జెన్' పరిశోధన కేంద్రం

మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో ఎంఓయూ

**హైదరాబాద్,ఆగస్టు 11 :** గ్లోబల్ దిగ్గజ బయోటెక్నాలజి సంస్థ 'యామ్జెన్' జెనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం నాడు సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి

మిగతా2లో...

## నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తి

- కారిడార్ కింద బిటి రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాల్సిందే
- ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ సమీక్షలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్,ఆగస్టు 11 :** రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి కావాల్సిందేనని, నిర్లక్ష్యాన్ని,పనుల్లో ఆలస్యాన్ని అస్సలు సహించేది లేదని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సమీక్షలో ఆర్ అండ్ బి సి.ఈ ధర్మారెడ్డి, పలువురు అధికారులు,నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. అటు వైపు నిత్యం ప్రయాణించే వారికి ఏళ్ల తరబడి నరకప్రాయంగా మారిందని,అందుకోసమే 2026 దసరా నాటికి పూర్తి చేస్తామని ప్రజలకు మాట ఇచ్చాం...మాట ప్రకారం చేసి తీరాల్సిందేనని

మిగతా2లో...

## 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత



- ఆగస్టు 15న సంగారెడ్డి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఏకకాలంలో కార్యక్రమాలు
- 1.06 కోట్ల కార్డులు.. ప్రతి లబ్దిదారుడికి నెలకు 6 కిలోల ఉచిత సన్నబియ్యం
- 2025 జనవరి 26 నుంచి కొత్తగా 16.32 లక్షల ఆహార భద్రత కార్డులు
- ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లలో ఎక్కడా లోటు ఉండొద్దు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు 11 :** పంద్రాగస్టు రోజు సంగారెడ్డి పట్టణంలో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జనసమీకరణ, భద్రత, వేదిక తదితరాంశాలపై ఫోకస్ పెట్టింది. ఇదే అంశంపై మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, సెట్విన్ ఛైర్మెన్ గిరిధర్ రెడ్డితోపాటు పలువురు ఉన్నతాధికారులు

మిగతా2లో...

# ప్రతి విద్యార్థికి ప్రపంచస్థాయి విద్య

● యంగ్ ఇండియా స్కూల్స్ లక్ష్యం ● ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ వెల్లడి



**హైదరాబాద్,ఆగస్టు 11 :** తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేట్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నాయని సీఎం వెల్లడించారు. 'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా

మిగతా2లో...



2లో

## నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దు

● చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం ● యుద్ధ ప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరించాలి ● నెల 14లోగా అన్ని డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేయాలి ● ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ లేదు ● సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలకు చెక్ ● ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల మేరకే నిర్ణయాలు ● మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

# విషాదాన్ని మిగిల్చిన కొలంబియా భూకంపం

**న్యూఢిల్లీ, 11:** కొలంబియాలో భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. సోమవారం పశ్చిమ కొలంబియాలో 7.4 తీవ్రతతో ఏర్పడిన భూకంపం ధాటికి మరణించిన వారి సంఖ్య 132కు చేరింది. మరో 570 మంది గాయపడ్డారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. భూకంప కేంద్రం చోకో ప్రాంతంలోని శాన్ జోసె డెల్ పాల్మార్ సమీపంలో ఉన్నట్టు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. భూకంపం సుమారు 107 కిలోమీటర్ల లోతులో సంభవించింది. దీని ప్రకంపనలు కొలంబియాలోని కాలీ, పెరీరా, మానిజాలెస్, బొగోటా తదితర ప్రాంతాలతోపాటు పొరుగు దేశాల్లోనూ నమోదయ్యాయి. భూకంప ధాటికి అనేక ప్రాంతాల్లో భవనాలు కుప్పకూలాయి. కాలీలోని ఓ ఆసుపత్రిలో పీడియాట్రిక్, నియోనేటల్ విభాగాలు దెబ్బతిన్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని రక్షణ సిబ్బంది వెలికితీశారు. ఆసుపత్రుల్లోని కొంతమంది రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాలీలోనే 30 శాతం వరకు ఆసుపత్రి నిర్మాణం దెబ్బతిన్నట్టు స్థానిక అధికారులు తెలిపారు. పెరీరా, కాలీ నగరాల్లో భవనాల కూలిపోవడంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. మానిజాలెస్‌లోని చారిత్రక కేథడ్రల్ టవర్ ఒకటి కూలిపోయింది. పలు ఇళ్లు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు కూడా దెబ్బతిన్నాయి. భూకంప తీవ్రత దృష్ట్యా కొలంబియా ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించింది. సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు సైనిక బలగాలను రంగంలోకి దించింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని సజీవంగా బయటకు తీసుకురావడమే తమ తొలి ప్రాధాన్యమని అధ్యక్షుడు అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా తెలిపారు. సైన్యం ప్రత్యేక శిక్షణ పొందిన రెస్క్యూ సిబ్బంది, శిథిలాల్లో చిక్కుకున్న వారిని గుర్తించే పరికరాలు, శునక దళాలను రంగంలోకి దించింది. రిమోట్ ప్రాంతాల్లో రహదారులు, సమాచార వ్యవస్థలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. భూకంపం కారణంగా పశ్చిమ కొలంబియాలోని పలు విమానాశ్రయాల్లో కార్యకలా పాలు నిలిచిపోయాయి. పెరీరా, మానిజాలెస్, ఆర్మేనియా, కార్టాగో, బ్యూనవెంచురా తదితర విమానాశ్రయాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల వైద్య, ప్రభుత్వ విమానాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. మరోవైపు కొలంబియాకు సాయం చేసేందుకు పలు దేశాలు ముందుకొచ్చాయి. ఈక్వెడార్ 47 మంది రెస్క్యూ సిబ్బంది, శిక్షణ పొందిన శునకాలు, ప్రత్యేక పరికరాలను పంపేందుకు సిద్ధమైంది.

# నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షలో మంత్రి పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పూర్తి జవాబుదారిగా వ్యవహరిస్తుందనీ,ఏళ్ల తరబడి అవస్థ పడుతున్న ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సురక్షిత ప్రయాణం అందించేలా చేద్దామని,అందుకు అనుగుణంగా అధికారులు మనసుపెట్టాలని ప్రత్యేకంగా కోరారు. మ్యాన్ పవర్ పెంచి..మూడు షిఫ్టుల్లో పనులు చేయాలనీ,రాత్రి వేళల్లో 11 నుండి ఉదయం 6గంటల వరకు నిరంతరాయంగా పనులు జరగాలనీ మంత్రి ఆదేశించారు.కారిడార్ కింద 6.25కి.మీ బిటి రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని తేల్చి చెప్పారు. ప్రతి పది రోజులకు ఒకసారి తాను స్వయంగా క్షేత్రస్థాయి పనుల పురోగతి సమీక్షిస్తానని.. అందుకు తగ్గట్టుగా రోజువారీ వర్క్ ప్రోగ్రెస్ అధికారులు సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. ÷-రస్తుతం క్షేత్ర స్థాయిలో నడుస్తున్న పనులపై మంత్రి కూలంకషంగా చర్చించారు.. సైట్ లోని కచ్చితమైన వాస్తవ పరిస్థితులు చెప్పాలని మంత్రి అధికారులు,వర్క్ ఏజెన్సీని అడిగారు. ప్రస్తుతం ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ 60? మేర పనులు పూర్తయ్యాయని మరో 40శాతం పనులు వేగంగా జరుగుతున్నాయని అధికారులు,వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు వివరించారు.

ఇరువైపుల లాంచింగ్ గడ్డర్లతో పనుల్లో వేగం పెంచాలనీ మంత్రి సూచించారు. ఉప్పల్ వైపు నుండి జరుగుతున్న పనుల పురోగతిని మంత్రి ఆరా తీశారు..ఇప్పటికే ఒక స్లాబ్ పూర్తయిందని,రెండో స్లాబ్ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాత్రిపూట పనుల వల్ల,వర్షాల వల్ల నిర్మాణం పూర్తికి మరింత సమయం పట్టే అవకాశం ఉన్నదనీ నిర్మాణ సంస్థ సమీక్ష సందర్భంగా విజ్ఞప్తి చేసింది. 2026 అక్టోబర్ 31 నాటికి అందుబాటులోకి తెస్తామని ఇప్పటికే డెడ్ లైన్ పెట్టుకున్నాం..ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులు గురించి ఆలోచించాలని మంత్రి అన్నారు. వర్క్ ఏజెన్సీ విజ్ఞప్తి పట్ల మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. నుల్లో మరింత వేగం పెంచాలని,మ్యాన్ పవర్ పెంచి మూడు షిఫ్టుల్లో పనిచేయాలని తెగేసి చెప్పారు. నెలకు ఆరు స్లాబుల చొప్పున పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థ మంత్రికి తెలిపింది. అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు సమాంతరంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. 2026 సంవత్సరంలో ఎట్టి పరిస్థితుల్లో ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిందేనని ఆర్ అండ్ బి అధికారులు,వర్క్ ఏజెన్సీ ఆ దిశగా పనిచేయాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

## నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దు

**హైదరాబాద్,ఆగస్టు 11 :** భూముల రెగ్యులరైజ్‌కు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన అన్ని డాక్యుమెంట్లను ఈనెల 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో 22ఏ అంశంపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్- మలాజ్‌గిరి, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్ రిజిస్ట్రార్లతో సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిషేధిత ఆస్తుల(22ఏ) జాబితాకు సంబంధించి అపోహలను తొలగించేందుకు ప్రభుత్వం ఇప్పటి వరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లే-అవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను ఇందులో పొందుపరచాలని ఆదేశించారు.

# సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృతి
- మరో ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

**సంగారెడ్డి,ఆగస్టు 11 :** సంగారెడ్డి జిల్లాలో రెండు ఘోర రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 9మంది దుర్మరణం చెందారు. ఈ రెండు వేర్వేరు ప్రమాదాలు జిల్లాలో జరగడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. జహీరాబాద్ మండలం సత్వార్ వద్ద ఆటోను ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలవగా.. మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరంతా కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరికి చెందిన వ్యవసాయ కూలీలుగా గుర్తించారు. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం హుమనాబాద్ నుంచి జహీరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.ప్రతిరోజు కూలి పని కోసం జహీరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాలకు కూలీలు వస్తూ ఉంటారు. ఆటోలో మొత్తం 14 మంది ఉన్నట్లు సమాచారం. ఆయిల్ ట్యాంకర్ హైదరాబాద్ వైపు నుంచి కర్ణాటకకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాలోని రాజగిరికి చెందినవారిగా గుర్తించారు. సమాచారం అందగానే పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోనే జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై ఓ కారు రోడ్డు డివైడర్ పైనుంచి అవతల వైపు ఎగిరి పడింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. నాలుగు వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

# ప్రతి విద్యార్థికి ప్రపంచస్థాయి విద్య

(మొదటి పేజీ తరువాయి)

రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు.

## పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

పనులపై సంబంధిత అధికారులతో సీఎం మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రో సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సమ్మిట్ పెట్టుబడులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణకు ప్లాన్ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సన్మానించాలని సూచించారు. గత ఏడాది పెట్టుబడులు, పురోగతిపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' పరిశోధన కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఎంఓయు చేసుకుంది. అంతకు ముందు శ్రీధర్ బాబుతో భేటీ అయిన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. సమావేశానంతరం యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణా ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. జెనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశోధన కేంద్రంలో స్థానిక ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వెల్లడించారు. యామ్జెన్ ఇటీవల 3 వేల మంది ఉద్యోగులతో అతి పెద్ద జిసిసిని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఔషధ రంగ దిగ్గజ కంపెనీలు తెలంగాణా పట్ల అపార విశ్వాసం కనబర్చడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌరవమని ఆయన అన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలకు రాష్ట్రం ఒక ముఖ్యమైన వేదికగా మారడం పట్ల శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేసారు. ఉద్యోగ అవకాశాల్లో ఇక్కడి యువతకు ప్రాధాన్యతనిచ్చి నియామకాలు జరపాలని యామ్జెన్ యాజమాన్యానికి ఆయన సూచించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, జీనోమ్ వ్యాలీ వంటి అభివృద్ధి చెందిన ఎకోసిస్టమ్ కారణంగా తెలంగాణ ప్రపంచ లైఫ్ సైన్సెస్ సంస్థలకు కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన అన్నారు. దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామ్జెన్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, ఇన్‌ఫ్లమేషన్, శ్వాసకోశ వ్యాధులు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోంది. ఎంఓయు కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్ పాల్గొన్నారు.

# జేపీసీ పరిశీలనకు ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

క్రమబద్ధీకరణ (ఎఫ్‌సీఆర్‌ఏ) సవరణ బిల్లు-2026పై విపక్షాలు పలు సందేహాలు లేవనెత్తిన పట్టించుకోకుండా హడవిడిగా ఆమోదించారు. దీంతో సదురు బిల్లుపై పలు రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లును వెనక్కి తీసుకోవాలని తమిళనాడు శాసనసభ మంగళవారం ఏకగ్రీవంగా ఒక తీర్మానం చేసింది. రాష్ట్రాలు, సంబంధిత వర్గాలతో విస్తృతంగా సంప్రదింపులు జరపాలని సూచించింది. మిజోరంలో వివిధ క్రైస్తవ మత విభాగాలకు చెందిన వేలాది మంది ఐజ్వాల్‌లో ప్రతిపాదిత సవరణలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. మిజోరం కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. ఈ విమర్శల నేపథ్యంలో ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లుపై మోడీ సర్కార్ వెనక్కి తగ్గింది.విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ (ఎఫ్‌సీఆర్‌ఏ) సవరణ బిల్లు-2026ను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపనున్నట్లు సమాచారం. కాగా, ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లును 2026 మార్చి 25న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఎఫ్‌సీఆర్‌ఏ నమోదు రద్దైన, స్వచ్ఛందంగా వదులుకున్న లేదా పునరుద్ధరణ పొందని సంస్థలకు చెందిన విదేశీ విరాళాలు, ఆస్తుల పర్యవేక్షణ, నిర్వహణ, వాటి భవిష్యత్ వినియోగానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేయడం దీని లక్ష్యం. చట్టంలోని జరిమానా విధానంలో మార్పులు కూడా ఇందులో ప్రతిపాదించారు. ఎఫ్‌ఫ్‌సీఆర్‌ఏ నమోదు రద్దు అయినప్పుడు లేదా పునరుద్ధరణ జరగనప్పుడు చర్చిలు, స్వచ్ఛంద సంస్థల ఆస్తులను స్వాధీనం చేసుకోవడం లేదా విక్రయించే పరిస్థితులు ఏర్పడతాయని నిరసనకారులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

# సగర్వంగా హర్ ఘర్ తిరంగా

**న్యూఢిల్లీ,ఆగస్టు 11 :** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీమంగళవారం ఓ వీడియో పోస్టు చేశారు. ఆగస్టు 15న జెండా పండుగను ప్రజలంతా సగర్వంగా నిర్వహించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ ప్రజలంతా 'హర్ ఘర్ త్రివర్ణ' ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించాలని మోదీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆగస్టు 15ని గర్వంగా జరుపుకోండి, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించండి, వికసిత్ భారత్ కోసం ప్రతిజ్ఞ చేయండి. హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా' అని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రతి ఇంటిలోనూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఓ వేడుకలా నిర్వహించాలని కోరారు. త్రివర్ణ పతాకం మనకు గర్వకారణమని, దేశం కోసం ఎల్లప్పుడూ సేవలందించేందుకు అది నిరంతరం స్ఫూర్తినిస్తుందని ప్రధాని చెప్పుకొచ్చారు. ఈసారి హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొని, భారత్ నిర్మాణానికి దోహదపడాలని ఆకాంక్షించారు. అలాగే, ఈ ఏడాది వందేమాతరం జాతీయ గీతం ఇతివృత్తంగా వేడుకలు నిర్వహించనున్నట్లు మోదీ పేర్కొన్నారు.

# రేవంత్ షెల్ కంపెనీల బాగోతం త్వరలోనే బండారం బయటపెడతాం

(మొదటి పేజీ తరువాయి)

బయటపెడతామని హెచ్చరించారు.మంగళవారంతెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. అనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ సంస్థకు ఛైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయీ కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ.2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు. శ్రీధర్‌బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా.? లేక సీఎం వత్తిడికి తలొగ్గరా అని ప్రశ్నల వర్షం కురిపించారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం సీఎం భార్యకు మూడెఎకరాలు కేటాయించడంపై కేసు నమోదైందని తెలిపారు. ముడా స్కాంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. అనుముల కొండల రెడ్డి టెస్రాక్ట్ సంస్థ కి చైర్మన్‌గా ఆయనే పేర్కొన్నారు. కొండల్‌రెడ్డికి సంబంధం లేకుంటే యూఎస్ కౌన్సిల్ మీటింగ్‌కి ఎలా వెళ్లారని నిలదీశారు. ఈ భూ కేటాయింపులను వదలబోమని వార్నింగ్ ఇచ్చారు. తిరుపతిరెడ్డి ఏ హోదాలో అధికారిక సమావేశాలకు వెళ్తారని ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు ఏ హోదాలో ఇస్తారని నిలదీశారు. రాష్ట్ర గవర్నర్‌నీ కలిసి ఈ విషయంపై విచారణ జరపాలని కోరతామని అన్నారు. 74 లక్షల ఓట్లు తొలగిస్తారనేది ఆందోళనకరమైన విషయమని చెప్పుకొచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత పార్టీ నేతలు న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తామని అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే జీఆర్ఎంబీ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తుందా లేదా స్పష్టం చేయాలన్నారు. జలసౌదాలో జరిగే జీఆర్ఎంబీ అజెండా మార్చుకుంటే జలసౌధను ముట్టడిస్తామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కి జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్ర చెప్పినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. వరుణ యాగం చేయడం తప్పు కాదు కానీ ప్రభుత్వం చేయాల్సిన పని చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

# 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లతోనూ మంత్రి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైరల్ ఫీవర్‌తో బాధపడుతుండటం వల్ల ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సంగారెడ్డి బహిరంగ సభను జయప్రదం చేసేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. జన సమీకరణ, భద్రత, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్నట్టు తెలిపారు.అదే రోజు ఏకకాలంలో అన్ని జిల్లాల్లో కార్డులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల నుంచి మొత్తం పది మంది లబ్ధిదారులకు సీఎం స్వయంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తారని తెలిపారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను ఆదేశించారు. స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల రాష్ట్రంలోని 3.42 కోట్ల మంది అర్హులైన లబ్ధిదారులు ప్రయోజనం పొందనున్నారని చెప్పారు. ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా ప్రతి అర్హుడికి ప్రతి నెలా ఆరు కిలోల నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదని తెలిపారు. సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ఇందుకోసం సరఫరా చేస్తోందని చెప్పారు. స్మార్ట్ కార్డుల ద్వారా రాష్ట్రంలో ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి ఆహార భద్రతను కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
RNI - TELTEL/2023/87644
తెలుగు దినపత్రిక
బుధవారం,
ఆగస్టు 12, 2026



## మూడేళ్ల సమస్యకు పరిష్కారం.. స్మశానవాటికలో విద్యుత్ పనులకు శ్రీకారం



**ఖానాపూర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సుర్జాపూర్ గ్రామ స్మశానవాటికకు మూడు సంవత్సరాల తర్వాత వెలుతురు, నీటి సౌకర్యం లభించబోతోంది. అరకొర నిధుల కారణంగా పనులు పూర్తి కాకపోవడంతో ఇప్పటివరకు అక్కడ విద్యుత్ లేకపోవడంతో అంత్యక్రియలకు వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామ సర్పంచ్ బక్కశెట్టి వెంకటరాములు చొరవతో మంగళవారం స్మశానవాటికకు విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. త్వరలోనే విద్యుత్ కనెక్షన్ ఇచ్చి బోరుకు నీరు, రాత్రిపూట లైటింగ్ సౌకర్యం కల్పిస్తామని సర్పంచ్ తెలిపారు. చిరకాల సమస్యకు పరిష్కారం లభించిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కడమంచి లక్ష్మణ్, పంచాయతీ సెక్రటరీ విక్రమ్ రాజ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గొర్రెల పెంపకందారుల సంక్షేమానికి కృషి చేస్తా మల్లేశం యాదవ్



**కరీంనగర్ రూరల్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మొగ్ధంపూర్ ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం ఆధ్వర్యంలో జిల్లా యూనియన్ చైర్మన్ బాషవేణి మల్లేశం యాదవ్, వైస్ చైర్మన్ చిగుర్ల శ్రీనివాస్ కురుమ, డైరెక్టర్ కాల్వ సురేష్ యాదవ్, జిల్లెల్ల పర్శరాములు యాదవ్, సందవేని ప్రసాద్ యాదవ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లేశం యాదవ్ మాట్లాడుతూ సభ్యుల సహకారంతోనే సంఘాల అభివృద్ధి సాధ్యమని, యాదవ కురుమ సోదరులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. గతంలో ఋణాలు పొందిన సభ్యులకు వడ్డీ భారం తగ్గించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే సంఘ అభివృద్ధి కోసం త్వరలోనే మెడికల్ షాపు ఏర్పాటు చేయనున్నట్లు, రాబోయే రోజుల్లో మహాసభ నిర్వహించి సభ్యులను కలవనున్నట్లు తెలిపారు. సంఘ సభ్యులు ఘనంగా సన్మానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా మైసమ్మ తల్లి బోనాల పండుగ



**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ కోతీరాంపూర్‌లో మైసమ్మ తల్లి బోనాల వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. సరస్వతి నగర్, గిద్దె పెరుమాండ్ల కాలనీవాసులు, మాజీ కార్పొరేటర్ జంగిలి ఐలందర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భక్తులు ఘన స్వాగతం పలికిన అనంతరం ఎమ్మెల్యే గంగుల అమ్మవారి బోనం ఎత్తుకుని ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శాశ్వత ప్రాతిపదికన నిర్మించాలని భక్తులు కోరగా, వచ్చే దసరా నాటికి ప్రజల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మిస్తానని కమలాకర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు ఎడ్ల అశోక్, దురిశెట్టి అనూప్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సఫాయి అప్నా భీమారీ భగావో కార్యక్రమం నిర్వహణ



**హుస్నాబాద్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ పట్టణ 11వ వార్డులో పురపాలక సంఘ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో సఫాయి అప్నా భీమారీ భగావో కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నిల్వ నీటిని తొలగించడం, పాత టైర్లు, కుండల్లో నీరు నిల్వ లేకుండా చూడడం, చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడం, చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించడం వంటి సూచనలు చేశారు. డయేరియా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షపు నీటిని హార్వెస్టింగ్ సిస్టమ్స్ ద్వారా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛత పక్షవాడ కార్యక్రమంలో బహుమతుల పంపిణీ





**హుస్నాబాద్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మేరా యువభారత్ (మైభారత్), సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్షవాడ కార్యక్రమం జరిగింది. విద్యార్థుల వ్యాసరచన పోటీల్లో విజేతలకు మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి బహుమతులు అందజేశారు. అదేవిధంగా వలస శంకరయ్య జ్ఞాపకార్థం విద్యార్థులకు వాలీబాల్ నెట్టు, స్కిప్పింగ్, టెన్నిస్ కాయిన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువులో రాణించి తల్లిదండ్రుల కలలు నిజం చేయాలని సూచించారు. మహాత్మా గాంధీ స్వచ్ఛ భారత్ కలను నెరవేర్చడం మనందరి బాధ్యత అని, పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, విద్యార్థులు, మేధావులు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్, కౌన్సిలర్లు, విద్యాలయ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్లకు దరఖాస్తుల పిలుపు

**- అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి**
**- కమిషనర్ రాఘవేందర్ రెడ్డి**




**ఆమనగల్లు, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలో చేయూత సోషల్ సెక్యూరిటీ పెన్షన్ పథకం ఫేజ్-1 కింద అర్హులైన వారి నుంచి నూతన పెన్షన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హిమోఫీలియా వంటి తీవ్ర రక్త రుగ్మతలతో బాధపడుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆయా వర్గాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుతో పాటు సమర్పించాలని సూచించారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు అవసరమైన సర్టిఫికెట్లు, గుర్తింపు పత్రాలతో ఆమనగల్ మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు మరోసారి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, రెండోసారి సమర్పించే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు. దరఖాస్తుల సమర్పణలో ఎలాంటి సందేహాలు లేదా ఇబ్బందులు ఉన్నా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వీలైనంత త్వరగా దరఖాస్తులు సమర్పించాలని కమిషనర్ రాఘవేందర్ రెడ్డి కోరారు.

# ప్లాస్టిక్ నియంత్రణతోనే పర్యావరణ పరిరక్షణ

**- విద్యార్థులకు అవగాహన కల్పించిన లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్**



**ఆమనగల్లు, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్లాస్టిక్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తలకొండపల్లిలో విద్యార్థులకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ సెక్రటరీ లయన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నేల, నీరు, పర్యావరణానికి కలుగుతున్న నష్టాలను విద్యార్థులకు వివరించారు. నిత్యజీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత మేర తగ్గించి, ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని, తమ కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల ప్రజలకు కూడా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రీన్ కమిటీ సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, రాధిక, కుమార్, పాఠశాల హెడ్ ధృతిక, గ్రీన్ హౌస్ కెప్టెన్ వర్షిణితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. "సే నో టు ప్లాస్టిక్-- సేవ్ ఎన్విరాన్‌మెంట్" నినాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని లయన్స్ క్లబ్ పీఆర్ఓ లయన్ పాషా పిలుపునిచ్చారు.

# సేవామూర్తి దేవమ్మకు ఘన నివాళి

**- మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందించిన వస్పుల జంగయ్య**



**ఆమనగల్లు, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు నవచైతన్య కాలనీకి చెందిన గద్ద దేవమ్మ మంగళవారం మృతి చెందడంతో హైదరాబాద్ టెలివిజన్ డైరెక్టర్ వస్పుల జంగయ్య ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. గతంలో వైద్య సదుపాయాలు, ఆసుపత్రులపై అవగాహన తక్కువగా ఉన్న రోజుల్లో కాలనీలో ప్రసవాల సమయంలో దేవమ్మ ముందుండి మహిళలకు ధైర్యం చెప్పేవారని, అనేక కుటుంబాలకు తనవంతు సేవలు అందించేవారని గుర్తుచేశారు. ఆమె చేసిన సేవలు కాలనీవాసుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని, దేవమ్మ మృతి కాలనీవాసులకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. సేవామూర్తిగా దేవమ్మ అందించిన సేవలను ఎప్పటికీ మరువలేమన్నారు. అనంతరం దేవమ్మ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. కార్యక్రమంలో జంతుక శంకర్, గద్ద జలాల్, జంతుక ఈదయ్య, జంతుక రాములు, శివ, చిన్న తదితరులు పాల్గొని దేవమ్మకు నివాళులర్పించారు.

# క్రీడలతో న్యాయవాదుల్లో నూతనోత్సాహం

**- న్యాయవాదుల క్రీడా పోటీలను ప్రారంభించిన జడ్జి నారం అరుణ్ కుమార్**



**ఆమనగల్లు, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** న్యాయవాదులు వృత్తిపరమైన బాధ్యతలతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమనగల్ జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్ సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమనగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని తెలిపారు. న్యాయవాదులు తమ వృత్తిలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఫలితాలతో సంబంధం లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకర్ యాదిలాల్ మాట్లాడుతూ న్యాయవాదుల ఆరోగ్యం, పరస్పర స్నేహభావాన్ని పెంపొందించేందుకు వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, జానకిరాములు, జమీల్, జూనియర్ కోర్టు సూపరింటెండెంట్ మురళీకృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శేఖర్, సంయుక్త కార్యదర్శి మధుగౌడ్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ గౌడ్, కోశాధికారి మల్లేష్, గ్రంథాలయ సెక్రటరీ గణేష్ గౌడ్, క్రీడా కార్యదర్శి సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, సర్దార్ నాయక్‌తో పాటు పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికి రూ.35 లక్షల బీమా చెక్కు

**- ఉప్పల వెంకటేష్ చేతుల మీదుగా అందజేత**




**ఆమనగల్లు, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తలకొండపల్లి మండలం అంతారం గ్రామానికి చెందిన తిరుమని శ్రీనివాస్ గౌడ్ రెండు నెలల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఆయన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ప్రమాద బీమా వార్షిక ప్రీమియం చెల్లించి ఉండటంతో మృతుడి కుటుంబానికి రూ.35 లక్షల ప్రమాద బీమా మంజూరైంది. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ చేతుల మీదుగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులతో కలిసి మృతుడి కుటుంబ సభ్యులకు రూ.35 లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవిత బీమా చేసుకోవాలని సూచించారు. అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు బీమా మొత్తం కుటుంబానికి ఆర్థికంగా ఎంతో భరోసా కల్పిస్తుందని తెలిపారు. కుటుంబ భవిష్యత్తు భద్రత కోసం బీమా ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. బీమా పథకాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రతి ఒక్కరూ తమకు అనుకూలమైన బీమా పథకాలను ఎంచుకోవాలని సూచించారు. శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికి బీమా మొత్తం అందడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము మరియు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతిని ధులు, మృతుడి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండలో కాథలిక్ సిస్టర్స్ సేవలకు సుయి జురిస్ హోదా

నల్లగొండ, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):నల్లగొండ పరిసర ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా నిరుపేదలకు, ఆపన్నులకు నిరంతర సేవలందిస్తున్న స్థానిక కాథలిక్ సిస్టర్స్ మఠానికి అత్యున్నత చట్టబద్ధమైన సుయి జురిస్ హోదా లభించింది. తెలంగాణ రాష్ట్రంలో ఒక స్థానిక సేవా సంస్థకు ఇలాంటి స్వతంత్ర హోదా రావడం ఇదే మొదటిసారి కావడం విశేషం.ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని గంధంవారి గూడెంలో ప్రత్యేక కృతజ్ఞతా బలిపూజ, అభినందన సభ వైభవంగా జరిగింది. నల్లగొండ పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ డాక్టర్ జోజి తుమ్మ దివ్యబలిపూజ సమర్పించారు. సంస్థ ప్రెసిడెంట్ మదర్ మేరీ జెనెట్ అధికారిక పత్రాన్ని చదివి వినిపించగా, సుపీరియర్ మదర్ మేరీ ఫిలిప్ప ఆ పత్రాన్ని బిషప్ థమన్ కుమార్కు అందజేశారు.బిషప్ థమన్ కుమార్ మాట్లాడుతూ, "ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న" అనే సూక్తిని సిస్టర్లు తమ నిరంతర సేవలతో నిజం చేస్తున్నారు. ఈ సంస్థ ద్వారా మరిన్ని ఉన్నతమైన సేవలు అందాలని ఆకాంక్షిస్తున్నాం" అని అన్నారు. జీఆర్ఐ ప్రెసిడెంట్ ఫాదర్ బాలశౌరి కూడా సిస్టర్ల సేవలను కొనియాడారు.ఈ వేడుకలో ఏపీసీసీ రాష్ట్ర పొలిటికల్ జనరల్ సెక్రటరీ పసల శౌరయ్య ముఖ్య అతిథిగా హాజరై సిస్టర్ల నిస్వార్థ సేవలను ప్రశంసించారు. మేనేజింగ్ కమిటీ ప్రతినిధి గోవిందరెడ్డి మాట్లాడుతూ, భవిష్యత్తులో సేవా పరిధి మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.అల్ఫోన్సస్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ హృదయ్ కుమార్ రెడ్డి, లిటిల్ ఫ్లవర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సిస్టర్ వసంత, చాన్స్‌లర్ ఫాదర్ అల్ల రెడ్డి, కేథడ్రల్ పారిష్ ప్రీస్ట్ ఫాదర్ బాలస్వామి, అలాగే ఫాదర్ మైఖేల్, ఫాదర్ ఇన్నయ్య, ఫాదర్ బాలరాజు, ఫాదర్ జూలియన్ తదితర గురువులు, సిస్టర్లు, పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొని సిస్టర్లను అభినందించారు




# ఆదివారం సెలవు దినం కాపాడుకుందాం అని సీఐటీయూ పిలుపు



నల్లగొండ, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మున్సిపల్ కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న ఆదివారం సెలవు దినాన్ని తొలగించే ప్రయత్నాలను అడ్డుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.డి. సలీం పిలుపునిచ్చారు.మంగళవారం సిఐటియు కార్యాలయంలో జరిగిన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "గత 25 సంవత్సరాలుగా అమలవుతున్న ఆదివారం సెలవు దినాన్ని తీసివేయడం అన్యాయం. మున్సిపల్ అధికారులు అలాంటి ఆలోచనలను విరమించుకోవాలి" అని అన్నారు.అలాగే, కార్మికుల పిఎఫ్, ఈఎస్ఐ ఖాతాల నుండి కటింగ్ చేసినప్పటికీ లబ్ధి పొందడానికి ప్రైవేటు కన్సల్టెన్సీలను నియమించడం తప్పు అని, మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక ఛాంబర్ ఏర్పాటు చేసి కార్మికులకు నేరుగా సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జోక్యం చేసుకొని నల్లగొండలో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి వేతనాలను నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన కోరారు. పండుగల రోజుల్లో ఒక పూట పని చేయించిన తర్వాత మరొక రోజు సెలవు ఇవ్వకుండా అదనపు పనులు చేయించడం సరైనది కాదని సలీం విమర్శించారు.ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీనర్ అవుట్ రవీందర్, యూనియన్ నాయకులు దాసరి లక్ష్మమ్మ, కత్తుల కృష్ణవేణి, దర్శనం ఎల్లమ్మ, కత్తుల పద్మ, దుబ్బ దీనమ్మ, ఇరుగంటి సాయమ్మ, పేర్ల రమేష్, ఏర్పుల శ్రావణ్ కుమార్, తీగల ఎల్లమ్మ, అంజయ్య, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గణపురం గ్రామంలో దారి కబ్జాపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

గుడిపల్లి ఆగష్టు 11.(నీలగిరి ఎక్స్ ప్రెస్):గుడిపల్లి మండలం, గణపురం గ్రామంలో గ్రామస్తులు వినియోగిస్తున్న దారిని కొందరు కబ్జా చేసి కంచె ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఎల్గురి వల్లపు రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించి, కబ్జాకు గురైన దారిని తిరిగి ప్రజల వినియోగానికి



అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు మండల తహసీల్దార్‌ను కలిసి సమస్యకు సంబంధించిన వినతిపత్రాన్ని సమర్పించారు.ప్రజలకు సంబంధించిన దారులను కబ్జా చేయడం, కంచెలు ఏర్పాటు చేయడం సరికాదని, అధికారులు తక్షణమే స్పందించి స్థలాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు కోరారు.గ్రామస్తుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మండల పార్టీ అధ్యక్షులు ఎల్గురి వల్లపు రెడ్డి తెలిపారు.

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ విజయవంతం

- బి ఎల్ ఎ లకృషి అభినందనీయం.
- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.

దేవరకొండ ఆగష్టు 11.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ విజయవంతంగా ముగియడంలో బూత్ లెవల్ ఏజెంట్లు అందించిన సేవలు, చూపిన నిబద్ధత అభినందనీయమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తూ, అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడటంతో పాటు అనర్హులైన ఓటర్లను గుర్తించే ప్రక్రియలో బి ఎల్ ఎ లు చూపిన నిబద్ధత, పట్టుదల, బాధ్యత ప్రశంసనీయమన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులు, అనర్హుల వివరాలను గుర్తించడం వంటి ప్రక్రియలో బి ఎల్ ఎ లు కీలక పాత్ర పోషించారని తెలిపారు.ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజల వద్దకు వెళ్లి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన ప్రతి బి ఎల్ ఎకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని రమావత్ రవీంద్ర కుమార్ ఆకాంక్షించారు.



# నాయబ్ తహసీల్దార్లకు శిక్షణ పూర్తి

- పరిపాలనా విధానాలు.. ప్రజా సేవలపై ప్రత్యేక అవగాహన
- వారం రోజుల శిక్షణ విజయవంతంగా పూర్తి

రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్): గ్రూప్--2 నియామక ప్రక్రియలో ఎంపికైన ఆరుగురు నాయబ్ తహసీల్దార్లకు రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయంలో నిర్వహించిన వారం రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం విజయవంతంగా ముగిసింది. ఆగస్టు 4 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన శిక్షణలో వైద్య, ఆరోగ్య శాఖ పరిపాలనా విధానాలు, కార్యాలయ నిర్వహణ, దస్త్రాల నిర్వహణ, ప్రభుత్వ వైద్య పథకాల అమలు, వివిధ విభాగాల పనితీరు, శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. పరిపాలనా అధికారి ఎండీ షఫీ ఉద్దీన్, జాతీయ ఆరోగ్య మిషన్ పరిపాలనా అధికారి సి. నాగరాజు శిక్షణలో పాల్గొని పరిపాలనా అంశాలపై నాయబ్ తహసీల్దార్లకు మార్గదర్శనం చేశారు. వంశీ కృష్ణ, ఎల్. వినిషా రెడ్డి, బండి సాబేర్, మల్లయ్య స్వామి, కె. ఆనంద్, గండియా శ్రీనివాస్ శిక్షణ పొందారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని ఎండీ షఫీ ఉద్దీన్ తెలిపారు. శిక్షణ ద్వారా వైద్య, ఆరోగ్య శాఖ కార్యక్రమాలు, కార్యాలయ విధానాలు, పరిపాలనా ప్రక్రియలపై ఉపయోగకరమైన అవగాహన లభించిందని సి. నాగరాజు పేర్కొన్నారు. వారం రోజుల శిక్షణ పూర్తికావడంతో నాయబ్ తహసీల్దార్లను మంగళవారం సాయంత్రం జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం నుంచి రిలీవ్ చేశారు.



# రైతు పొలాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్



తిమ్మాజిపేట, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):తిమ్మాజిపేట మండల పరిధిలోని మరికల్ గ్రామాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్ సందర్శించారు. రైతు పెర్కంపల్లి లింగం పొలాన్ని పరిశీలించిన కలెక్టర్, వ్యవసాయంతో పాటు పశుపోషణ ద్వారా రైతులు పొందుతున్న అదనపు ఆదాయంపై సమగ్రంగా ఆరా తీశారు.రైతు వద్ద ఉన్న పశువుల సంఖ్య, పాల ఉత్పత్తి, విక్రయాలు, నెలవారీ ఆదాయం, పశువుల సంరక్షణ ఖర్చులు, మేత లభ్యత, టీకాలు, వైద్య సేవలు వంటి అంశాలను కలెక్టర్ స్వయంగా తెలుసుకున్నారు. "వ్యవసాయంపై మాత్రమే ఆధారపడకుండా పశుపోషణ, పాల ఉత్పత్తి వంటి అనుబంధ రంగాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా రైతులు నిరంతర ఆదాయ వనరులు పొందగలరు" అని ఆయన సూచించారు.పాడి పశువుల ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, సమయానుకూల వైద్య సేవలు అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. నాణ్యమైన మేత, పచ్చిమేత సాగు, సమతుల్య పోషకాహారం అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుందని, రైతుల ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని వివరించారు.పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల సమయంలో టీకాలు తప్పనిసరిగా వేయించాలని రైతులకు సూచించారు. పశువుల ఆరోగ్యంలో మార్పులు కనిపించిన వెంటనే సమీప పశువైద్య కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పశుసంవర్ధక సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పశుపోషణను సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా శాస్త్రీయ విధానాలతో చేపట్టినప్పుడు తక్కువ వ్యయంతో అధిక ఉత్పాదకత సాధ్యమవుతుందని ఆయన నొక్కి చెప్పారు.ఈ సందర్భనలో డిఆర్‌ఓ పాండు, మండల తహసీల్దార్, మరికల్ సర్పంచ్ రమాదేవి, వ్యవసాయ మరియు పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతను నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): 27వ డివిజన్‌లో ఓల్గా చిల్డ్రన్స్ హాస్పిటల్ భవనం కూల్చివేత సమయంలో పక్క ఇళ్లకు నష్టం కలగడంతో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది.జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ భవన యాజమాన్యం, మున్సిపల్ అధికారులు భద్రతా నిబంధనలు పాటించకపోవడం వల్ల ఒక మహిళ గాయపడిందని, ఆస్తి నష్టం జరిగిందని విమర్శించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతను నిర్లక్ష్యం చేయడం అసహ్యం అని అన్నారు. ఘటనపై తక్షణ చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని, హాస్పిటల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి దెబ్బతిన్న ఇంటిని పునర్నిర్మించాలని, నిర్లక్ష్యం చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజల భద్రత విషయంలో రాజీపడబోమని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బీజేపీ దాడులపై కాంగ్రెస్ ఆగ్రహం




కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు భూకబ్జాలు, ఇప్పుడు బీజేపీ కార్పొరేటర్లు దాడులకు పాల్పడుతున్నారని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు. స్థానిక ముఖరంపురలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రశాంత కరీంనగర్ ప్రజలను పరేషాన్ చేస్తామంటే కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. బాధ్యత గల పదవిలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జరుగుతున్న దాడులపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.బీజేపీ కార్పొరేటర్లు అధికారిక క్యాంపు కార్యాలయం, విద్యార్థుల నిరసనలపై కర్రలు, కత్తులు, బీరు సీసాలతో దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి ముప్పు అని పేర్కొన్నారు. పోలీసులు వెంటనే స్పందించి నిందితులను అరెస్ట్ చేశారని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ సమావేశంలో మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి తాజ్, కార్పొరేటర్లు వారాల నర్సింగం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, దండి రవీందర్, ముక్క భాస్కర్, జీడి రమేష్, ఎండి చాంద్, షబానా, మహమ్మద్, తోట అంజయ్య, గుడిపాటి రమణా రెడ్డి, బషీర్, బత్తుల రాజ్ కుమార్, ఖలీల్, మేకల నర్సయ్య, జాఫర్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించాలని టీఆర్ఎస్ డిమాండ్

కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నారాయణపూర్ రిజర్వాయర్ నిర్మాణం వల్ల ప్రభావితమవుతున్న నారాయణపూర్ గ్రామాన్ని అధికారికంగా ముంపు గ్రామంగా ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. గ్రామ ప్రజలు భూములు, ఇళ్లు, జీవనాధారం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని, ప్రభుత్వం ముందుగానే స్పష్టమైన ప్రకటన చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆయన అన్నారు. అక్రమంగా గ్రామస్థులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు.నిర్వాసితులకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించాలని, పిల్లల విద్య, ఉపాధి, తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూ అభివృద్ధి జరగాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజు, చొప్పదండి నియోజకవర్గ నాయకులు మ్యాకల తిరుపతి, మ్యాక వినోద్, కొత్తపల్లి తిరుపతి, చంటి శ్రీనివాస్, బుడిగె పర్శారం గౌడ్, జంగ అపర్ణ, లింగంపల్లి మల్లేశ్, రంగరవేణి లక్ష్మణ్, కుతాడి శ్రీనివాస్, బసవేణి రాజేందర్, మ్యాక మారుతి తదితరులు పాల్గొన్నారు.



# 28వ రోజుకు చేరిన విద్యుత్ ఉద్యోగుల నిరసన



కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో కోల్, యాష్ హ్యాండ్లింగ్ విభాగాలను ప్రైవేటుపరం చేయడానికి ప్రభుత్వం టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ విద్యుత్ ఉద్యోగుల ఆందోళన 28వ రోజుకు చేరింది.కరీంనగర్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం ఆవరణలో టీజీపిఈ జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 40 రోజులుగా నిరసనలు కొనసాగుతున్నప్పటికీ మేనేజ్మెంట్ టెండర్లను రద్దు చేయకపోవడం ఆందోళనకరమని, మొండి వైఖరి కొనసాగితే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో రమణారావు, మహేందర్ రావు, శ్రీనివాస్, రమేష్, సంతోష్, నిఖిల్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు సహించం ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కిసాన్ నగర్‌లో బీఆర్ఎస్ కార్యకర్త శ్రీకాంత్‌పై జరిగిన దాడి కలకలం రేపింది. తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరామర్శించి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ మేయర్ పీఠం బీజేపీకి దక్కిన తర్వాత నగరంలో దాడుల సంస్కృతి మొదలైందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ హయాంలో ఇలాంటి ఘటనలు జరగలేదని గుర్తుచేశారు. బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు అనుచరులతో కలిసి ఇనుప రాడ్లతో దాడి చేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ జరుగుతున్న దాడులపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం అభినందనీయమని, రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.కేసీఆర్ హయాంలో కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేశామని, బీజేపీ మాత్రం దాడుల సంస్కృతిని ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, కేటీఆర్ త్వరలోనే కరీంనగర్‌కు రానున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని కాపాడాలి టీజేపీసీ



**అమ్రాబాద్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం వెంటనే కేకే కమిటీ సిఫార్సులను అమలు చేయాలని టీజేపీసీ రాష్ట్ర సెక్రటరీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అమ్రాబాద్ మండల కేంద్రంలో టీజేపీసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలకు గడువు పూర్తయినా ప్రభుత్వం అమలు చేయడంలో జాప్యం చేస్తోందని విమర్శించారు. కేకే కమిటీ కూడా కాలయాపన చేస్తోందని, దీనివల్ల ఉద్యమకారులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. ప్రతి ఉద్యమకారునికి గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లు ఇవ్వాలని, నెలకు రూ.25 వేల పెన్షన్, ఉచిత బస్సు ప్రయాణం, స్థలం, ఇన్సూరెన్స్, పిల్లలకు ఉచిత విద్య, వైద్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యమంలో త్యాగాలు చేసిన ప్రతి ఒక్కరి ఆత్మగౌరవాన్ని నిలబెట్టే వరకు పోరాటం ఆగదని, ప్రభుత్వం మోసం చేస్తే మరో ఉద్యమానికి సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కల్ముల నాసరయ్య, అధికార ప్రతినిధి జక్క బాలకిష్టయ్యతో పాటు పలువురు ఉద్యమకారులు, టీజేపీసీ నాయకులు పాల్గొన్నారు.

## పేద, గ్రామీణ బాలికలకు ఈ-సైకిళ్ల పంపిణీ



**అమ్రాబాద్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మహిళా సమైక్య కార్యాలయంలో తెలంగాణ సమ్మిళిత జీవనోపాధి పథకం కింద బాలికలకు ఈ-సైకిళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు సైకిళ్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేద, గ్రామీణ బాలికల విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని, విద్యార్థుల రవాణా సౌకర్యం కోసం ప్రత్యేకంగా ఈ-సైకిళ్లు అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ వివిధ పథకాలు అమలు చేస్తున్నారని, నియోజకవర్గంలో ఉచిత కుట్టుమిషన్లు, సబ్సిడీ పరికరాలు కూడా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామీణ పేదరిక నిర్మూలన అధికారులు, మహిళా సమైక్య సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత గొడవలను బీజేపీపై రుద్దడం దుర్మార్గం డిప్యూటీ మేయర్



**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కిసాన్ నగర్‌లో జరిగిన గొడవను బీజేపీ పార్టీపై రుద్దడం దుర్మార్గమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మండిపడ్డారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత గొడవలను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బీజేపీపై మోపడం సరికాదని అన్నారు. గతంలో బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణుపై జరిగిన దాడిని కూడా వ్యక్తిగత గొడవగానే భావించామని, ఎప్పుడూ ఇతర పార్టీలపై ఆరోపణలు చేయలేదని స్పష్టం చేశారు. గంగుల కమలాకర్ పదే పదే బీజేపీపై ఆరోపణలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకోవడం మంచిది కాదని, బండి సంజయ్ నేతృత్వంలో కరీంనగర్ అభివృద్ధి జరుగుతోందని ప్రజలు విశ్వసించి బీజేపీకి మేయర్ పీఠం కట్టబెట్టారని తెలిపారు. వ్యక్తిగత గొడవలను రాజకీయాలపై రుద్దడం సిగ్గుచేటని, బీజేపీ అభివృద్ధి మాత్రమే లక్ష్యంగా పెట్టుకుంటుందని, దాడుల సంస్కృతి తమది కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధరల పెంపునకు నిరసనగా సీపీఐ ప్రజా చైతన్య యాత్రకు పిలుపు



**హుస్నాబాద్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలపై భారాన్ని మోపుతోందని సిపిఐ నాయకులు మండిపడ్డారు. ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆగస్టు 6 నుంచి జరుగుతున్న ప్రజా చైతన్య యాత్ర ముగింపు బహిరంగ సభను ఆగస్టు 13న హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ తెలిపారు. ఈ సభకు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్, ప్రజా నాట్య మండలి కళాకారులు హాజరుకానున్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య, ఎఐవైఎఫ్ నాయకులు, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శులు, మండల నాయకులు, ప్రజా కళాకారులు పాల్గొన్నారు. ప్రజా చైతన్య గీతాలు జనాన్ని ఆకర్షించాయి.

## డ్రైనేజీ సమస్యపై క్షేత్రస్థాయి పరిశీలన



**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కమాన్ రోడ్ లక్ష్మీనగర్ (37వ డివిజన్) పరిధిలో మురికినీరు, డ్రైనేజీ సమస్యల నివారణకు శాశ్వత పరిష్కార చర్యలు ప్రారంభమయ్యాయి. ఇటీవలి భారీ వర్షాల కారణంగా వీధులు, ప్రధాన రహదారులపై మురికినీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ కె.ఏ.పి.పి. చంద్ర అభ్యర్థన మేరకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు.

## ఘనంగా పోచమ్మ తల్లి బోనాల వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుటుంబ సమేతంగా గ్రామ దేవత పోచమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజల ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులు అమ్మవారికి బోనం ఎత్తి మొక్కులు తీర్చుకున్నారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో నగర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 39వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ మాసం గణేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పింఛన్ల సర్వేను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో జిల్లాలో ఒక్క అర్హుడూ మిస్ కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొత్తగా పింఛన్లకు అర్హత పొందే వారిని శాచురేషన్ మోడ్‌లో గుర్తించి వారం రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు వారీగా యుద్ధప్రతిపాదికన సర్వే నిర్వహించి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. మొదటి దశలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నవారికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఇంటింటి సర్వేతో అర్హులను గుర్తించి, అవసరమైన ధ్రువ పత్రాలు సిద్ధంగా ఉంచేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు సహకారంతో మున్సిపల్ అధికారులు, గ్రామాల్లో అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు కలిసి ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఆర్‌డీవో గీత, మెప్మా పీడీ స్వరూపారాణి, డీపీవో జగదీశ్వర్‌తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గీతా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్



**హుస్నాబాద్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గీతా కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు కోహెడ కొమరయ్య డిమాండ్ చేశారు. ఆగస్టు 2న మహబూబాబాద్ జిల్లా మానుకోట నుండి ప్రారంభమైన గీత కార్మికుల బస్సు చైతన్య యాత్ర ఆగస్టు 18న హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద మహాసభతో ముగియనుంది. కార్మికుల ప్రధాన డిమాండ్లలో వృత్తి పెన్షన్‌ను రూ.2 వేల నుండి రూ.4 వేలకి పెంచడం, కొత్త పెన్షన్లు మంజూరు చేయడం, పెండింగ్‌లో ఉన్న రూ.20 కోట్ల ఎక్స్‌గ్రేషియా విడుదల, ద్విచక్ర వాహనాల పంపిణీ, నీరా ప్రాజెక్టులు, కమ్యూనిటీ హాల్స్‌కు నిధులు, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల కేటాయింపు ఉన్నాయి. కనీసం 25 సంవత్సరాలు తాళ్లెక్కి రిటైర్మెంట్ పొందిన వారికి పెన్షన్‌తో పాటు రూ.5 లక్షల బెనిఫిట్ ఇవ్వాలని, సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని వారు కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈనెల 15న సర్వాయిపేటలో, 18న ట్యాంక్ బండ్ వద్ద జరిగే మహాసభను విజయవంతం చేయాలని కార్మికులను పిలుపునిచ్చారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి టీఎన్జీవో



**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. కరీంనగర్ టీఎన్జీవోల సంఘ భవనంలో జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సిపిఎస్ కారణంగా ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు పిఆర్సి, డిఏ బకాయిలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సమావేశం ఏకగ్రీవంగా డిమాండ్ చేసింది. డిపెండెంట్స్ నమోదు ప్రక్రియను సరళీకరించి, మరిన్ని ఆసుపత్రులను ఈ హెచ్ఎస్ నెట్‌వర్క్‌లో చేర్చాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత విషయంలో ప్రభుత్వం జాప్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి సంఘాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సంగెం లక్ష్మణ్ రావు, కిరణ్ కుమార్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్ సింగ్, ప్రభాకర్ రెడ్డి, మారుపాక రాజేష్, ఇరుమల్ల శారద, సునీత, సరిత, సుస్మిత, గంగారపు రమేష్ గౌడ్, పవన్ కుమార్, కమలాకర్, కోట రామ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మల్యాల చెరువుకు నీరు తరలించాలని డిమాండ్



**నందికొట్కూరు, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నందికొట్కూరు పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ కేసీ కెనాల్ నుంచి హంద్రీ--నీవా సుజల స్రవంతి ముచ్చుమర్రి లిఫ్ట్ స్కీమ్ ద్వారా మల్యాల చెరువుకు నీటిని తరలించి, అక్కడి నుంచి పట్టణానికి త్రాగునీరు అందించాలని కోరారు. పాత పైప్‌లైన్లు, పంపింగ్ వ్యవస్థలు, నీటి నిల్వ సామర్థ్యాలను పరిశీలించి మరమ్మతులు చేపడితే ప్రజలకు దీర్ఘకాలికంగా నీటి భద్రత కల్పించవచ్చని తెలిపారు. త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం అవసరమైతే ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండ్ల రామకృష్ణ, షేక్ బీబీ, సుధాకర్, సంగెం శివన్న, పసుల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిల్ సమావేశాలు వెంటనే నిర్వహించాలి రవీందర్ సింగ్



**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మూడునెలలుగా కరీంనగర్ నగరపాలక సంస్థలో కౌన్సిల్ సమావేశాలు జరగకపోవడంపై మాజీ మేయర్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించేందుకు ప్రతి నెలా సమావేశం నిర్వహించాల్సి ఉందని, కానీ వరుసగా మూడు నెలలుగా సమావేశాలు జరగకపోవడం ప్రజాస్వామ్య విధానానికి విరుద్ధమని ఆయన విమర్శించారు. పలుమార్లు కోరినా అధికారులు స్పందించలేదని తెలిపారు. మున్సిపల్ చట్టాలు, మార్గదర్శకాల ప్రకారం సమావేశాలు నిర్వహించి నివేదికలు సమర్పించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. నిబంధనలు పాటించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు ఎన్నుకున్న కార్పొరేటర్లు సమస్యలను కౌన్సిల్‌లో ప్రస్తావించే అవకాశం కల్పించాలని, పారదర్శకంగా ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగాలని ఆయన డిమాండ్ చేశారు.

## హమాలి కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆందోళనకు పిలుపు



**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆల్ మండల్ హమాలి యూనియన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం కరీంనగర్‌లోని సిఐటియు ఆఫీస్‌లో జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షుడు యు. శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా హమాలి కార్మికుల సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, హెల్త్ కార్డులు, పింఛన్లు, ఇళ్లు, గుర్తింపు కార్డులు, ప్రమాదంలో మరణించిన వారికి పరిహారం వంటి అంశాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 13న ఉదయం 11 గంటలకు మండల కేంద్రాల్లో ధర్నాలను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చుక్క కుమారు, ఆవుల రాజయ్య, గంగిపల్లి కుమారు, శ్రీనివాస్, కొమురయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం కరపత్రం విడుదల చేశారు.

## పేదల ఇళ్ల విషయంలో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న కౌశిక్ రెడ్డి ప్రణవ్



**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో కౌశిక్ రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ మండిపడ్డారు. జమ్మికుంట మండలంలోని గంద్రపల్లి గ్రామంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీగా, విప్‌గా ఉన్నప్పుడు పేదలకు ఇళ్లు ఎందుకు పంచలేదో కౌశిక్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రుల సహకారంతో నిధులు మంజూరు చేసి గృహప్రవేశాలు జరుపుతున్నామని, ఇది ఓర్వలేక కౌశిక్ రెడ్డి అడ్డుపడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధిగా హుందాతనంగా వ్యవహరించాల్సిన ఎమ్మెల్యే ప్రజల సంక్షేమానికి విరోధకంగా ప్రవర్తించడం సిగ్గుచేటని, ఇలాంటి చర్యలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రానున్న రోజుల్లో జమ్మికుంట, హుజురాబాద్, బుజునూర్ గ్రామాల్లో నిర్మించిన ఇళ్లను అర్హులైన వారికి మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పరశురాం, సుంకరి రమేష్, కిరణ్, స్వప్న-సదానందం, సత్తి రెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ నెల 18,19న పంచాయతీ కార్మికుల దీక్షకు పిలుపు



**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు సమయానికి చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, ఆగస్టు 18--19 తేదీల్లో మండల ఎంపీడీవో కార్యాలయాల వద్ద జరిగే దీక్షలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చెల్పూరు గ్రామపంచాయతీ వద్ద కార్మికులతో కలిసి పత్రిక ప్రకటన విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాలున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు అమలు చేయకపోవడం బాధాకరమని, కార్మికుల జీతాలు బకాయిగా ఉన్నాయని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలుగా చెల్లించాలని, ప్రభుత్వం నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, ప్రమాద బీమా రూ.20 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శనిగరపు కొమురయ్య, నగునూరు మనక్క, అంతడుపుల సరోజన, నిజానపురి సంపత్, సమ్మయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ సీఎంఆర్‌ను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్



**జగిత్యాల, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ను యుద్ధప్రతి పాదికన పూర్తి చేయాలని, మిల్లింగ్, రవాణా, గిడ్డంగుల సమస్యలను తొలగించాలని కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోడిపల్లి గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లతకు వినతిపత్రం సమర్పించిన ఆయన మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా ఎఫ్‌సిఐకి సరఫరా చేయాల్సిన లక్ష్యం చేరలేదని, పెండింగ్‌లో ఉన్న ధాన్యం నిల్వలను వెంటనే మిల్లింగ్ చేసి పంపాలని కోరారు. జాప్యం వలన రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతోందని, దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, దాదాపు 58 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎఫ్‌సిఐకి బకాయిగా ఉందని, మిల్లర్ల నుండి వెంటనే సేకరించి ఇవ్వాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొక్కు గంగాధర్, పంచరీ విజయ్, ఆమోదరాజు, విట్టల్ రాజేందర్ రెడ్డి, రాజు, మామిడి మల్లేశం, రైతులు పాల్గొన్నారు.

# ఎన్‌సిడి స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణ



**హుస్నాబాద్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మహ్మదాపూర్‌లో మంగళవారం ఎన్‌సిడి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఎంపిహెచ్‌ఏ బి. శ్రీలత ఆధ్వర్యంలో 30 ఏళ్లు పైబడిన వారికి మధుమేహం, అధిక రక్తపోటు, సాధారణ క్యాన్సర్ల కోసం పరీక్షలు చేశారు. టిజిఎన్‌సిడి స్క్రీనింగ్ యాప్ ద్వారా రక్తపోటు, చక్కెర స్థాయిలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఆశా వర్కర్లు కే. భూలక్ష్మి, పి. వనజ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పాలన మార్పే లక్ష్యంగా సిపిఐ ప్రచార యాత్ర





**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బీజేపీ ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతూ కార్పొరేట్ శక్తులకు రాయితీలు ఇస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మండిపడ్డారు. మానకొండూర్ మండలంలో జరిగిన ప్రచార యాత్రలో ఆయన మాట్లాడుతూ డిజిటలైజేషన్ పేరుతో ప్రజలపై పన్నులు వేయడం ప్రజా వ్యతిరేక చర్య అని, రానున్న రోజుల్లో ప్రజలు ఓట్ల ద్వారా బీజేపీ పాలనను డిలీట్ చేస్తారని హెచ్చరించారు.నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారాన్ని మోపుతున్నారని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.దేశంలో పాలన మార్పు కోసం సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరిగే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, మండల కార్యదర్శి బండ రాజిరెడ్డి, జాతా కోఆర్డినేటర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కాకతీయ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్యు డిమాండ్



**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అనుమతి లేకుండా ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహిస్తున్న కాకతీయ బ్రైట్ కిడ్స్ పాఠశాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిడిఎస్యు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ మాట్లాడుతూ, ఎలాంటి పర్మిషన్లు లేకుండా నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ తరగతులు, హాస్టల్ నిర్వహిస్తున్న పాఠశాల యాజ మాన్యం విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తోందని ఆరోపించారు.ఎంఈఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, జిల్లా విద్యాధికారి తక్షణమే చర్యలు తీసుకుని పాఠశాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. లేని పక్షంలో ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరి ంచారు. కార్యక్రమంలో లోకిని మల్లేష్, వెల్లి రాజు, అంగిడి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ధంగర్‌వాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఈ వేడుకల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సరస్వతీ దేవి విగ్రహం వద్ద భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు బోనాలు ఎత్తుకుని మంగళహారతులు, కోలాటాల నడుమ అమ్మవారిని ఆరాధించారు. విద్యార్థుల చదువుల్లో రాణించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రామగుండం నియోజకవర్గంలోని ఆలయ అభివృద్ధి, నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ దేవాదాయ ధర్మదాయ శాఖ అదనపు కమిషనర్‌ను కోరారు.మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయన ఆలయాల అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.ఈ సమావేశంలో రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు ఎండీ ముస్తాఫా, గట్ల రమేష్ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థి ఎంపిక





**పెద్దపల్లి, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థి ముబస్సిర్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 12న సికింద్రాబాద్ జి.ఎస్.ఎం టేబుల్ టెన్నిస్ అకాడమీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆయన పాల్గొననున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తగురం తిరుపతి తెలిపారు.ఈ విజయంపై పాఠశాల కరస్పాండెంట్ సయీద్ అహ్మద్, ప్రధానోపాధ్యాయుడు హకీమ్ ఖాన్ విద్యార్థిని అభినందించారు.

# 200 మీటర్ల పొడవైన త్రివర్ణ పతాకంతో ఘనంగా తిరంగా ర్యాలీ



**సుల్తానాబాద్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ సుల్తానాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో, కన్వీనర్ ఉషణ అన్వేష్ నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో సుమారు రెండు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. 200 మీటర్ల పొడవైన భారీ త్రివర్ణ పతాకాన్ని విద్యార్థులు పట్టుకుని పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించగా దేశభక్తి నినాదాలతో పట్టణం మార్మోగింది.ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, రాష్ట్ర నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు మీసా అర్జున్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు జాతీయ జెండా భారతదేశ సార్వభౌమత్వం, ఐక్యత, త్యాగాలకు ప్రతీక అని పేర్కొన్నారు.మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేయడం సం తోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ 2026లో 2.68 లక్షల ఫార్ముల డిజిటైజేషన్

**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ--2026లో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 3,68,832 మంది ఓటర్లు ఉన్నారని అధికారులు తెలిపారు. వీరిలో 2,68,214 మంది ఏనుమేరేషన్ ఫార్మ్స్ సేకరించి డిజిటైజ్ చేయబడ్డాయి. ఇది మొత్తం ఓటర్లలో 72.72 శాతం.సేకరించలేని 1,00,618 ఫార్మ్స్‌లో అధికంగా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, మరణించిన వారు, ఇప్పటికే ఇతరచోట నమోదు అయిన వారు ఉన్నట్లు గుర్తించారు.సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం ఆగస్టు 17 నుండి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, ఆబ్జెక్షన్లు స్వీకరించబడతాయి. అర్హత కలిగిన ఓటర్లు తమ పేర్లు జాబితాలో ఉన్నాయా లేదా పరిశీలించి, తప్పులు ఉంటే నిర్ణీత గడువులో దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు.

# విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



**నందికొట్కూరు, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామంలో విద్యుత్ స్తంభాల పనులు చేస్తుండగా బెంగాల్ రాష్ట్రం కలకత్తాకు చెందిన రాజా షేక్ (28) విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సిపిఎం నాయకులు ఎం నాగేశ్వర రావు, గోపాలకృష్ణ, ఉస్మాన్ భాష ఘటన స్థలాన్ని పరిశీలించారు. మేనేజ్మెంట్ నిర్లక్ష్యం, విద్యుత్ అధికారుల బాధ్యతారాహిత్యం కారణంగా యువకుడు ప్రాణాలు కోల్పోయాడని వారు ఆరోపించారు. మృతుడి కుటుంబానికి 50 లక్షల పరిహారం చెల్లించాలని, విద్యుత్ అధికారులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోస్టుమార్టం ఆధారంగా కేసు నమోదు చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. తోటి కార్మికులను బెదిరించడం ఆపాలని, పోలీసులు, వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కోర్టులో కేసులు వేస్తామని స్పష్టం చేశారు.

# మత్తు వల్ల భవిష్యత్తు నాశనం జిల్లా ఎస్పీ సునీల్ షొరణ్





**నంద్యాల, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం జీవితాలను నాశనం చేస్తుందని జిల్లా ఎస్పీ సునీల్ షొరణ్ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ ఎస్డిపిఓ పర్యవేక్షణలో దొర్నిపాడు మండలం చాకరాజువేముల గ్రామంలో "పల్లెబాటలో--ఈగల్" అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులు మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడం, కుటుంబ సంబంధాలు దెబ్బతినడం, ఆర్థిక సమస్యలు, చదువు, ఉద్యోగ భవిష్యత్తు నాశనం కావడం వంటి తీవ్ర పరిణామాలను వివరించారు. మత్తు ప్రభావంతో నేరాలకు పాల్పడే అవకాశం పెరుగుతుందని హెచ్చరించారు. ఎం.పి.ఎస్ చట్టం ప్రకారం మత్తు పదార్థాలను కలిగి ఉండటం, విక్రయించడం, రవాణా చేయడం వంటి నేరాలకు కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. వ్యసనానికి గురైన వారిని డి-అడిక్షన్ సెంటర్లలో చేర్పించి చికిత్స అందించాలని సూచించారు.గ్రామాల్లో మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై సమాచారం ఉంటే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయాలని కోరారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల సహకారం అవసరమని, యువత విద్య, ఉద్యోగం, క్రీడలు వంటి మంచి మార్గాల వైపు దృష్టి సారించాలని పోలీసులు పిలుపునిచ్చారు.

# భూ పరిపాలనపై సమీక్ష సమావేశం





**నంద్యాల, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ కుమారి గనియ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర సచివాలయం నుంచి భూ పరిపాలనపై వీడియో కాన్ఫరెన్స్ జరిగింది.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జయలక్ష్మి అన్ని జిల్లాల కలెక్టర్లతో 22ఏ, రీ-సర్వే, కోర్టు కేసులు, పిజిఆర్ఎస్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనంజయ్, డిఆర్ఓ రామునాయక్, రెవెన్యూ, ల్యాండ్ అండ్ సర్వే అధికారులు పాల్గొన్నారు.

# బైక్ మెకానిక్‌లకు అండగా ఉంటాం మున్సిపల్ చైర్మన్



**పెద్దపల్లి, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెద్దపల్లి పట్టణంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో టూ వీలర్ మెకానిక్‌లకు మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య మాట్లాడుతూ, పట్టణంలోని బైక్ మెకానిక్‌లకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అలాగే ఎమ్మెల్యే విజ్జన్న సహకారంతో బైక్ మెకానిక్ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. గత 25 సంవత్సరాలుగా సంఘ అధ్యక్షునిగా తనపై చూపిన అభిమానానికి మెకానిక్ సోదరులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్‌ను శాలువాలతో సన్మానించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరుగుదల తల్లిదండ్రుల నమ్మకానికి నిదర్శనం - కలెక్టర్ కోయ శ్రీహర్ష





**పెద్దపల్లి, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెరగడం తల్లిదండ్రుల నమ్మకానికి నిదర్శనమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.2025--26 విద్యా సంవత్సరంలో 31,140 మంది విద్యార్థులు నమోదు కాగా, 2026--27లో ఇప్పటివరకు 32,639 మంది నమోదు అయ్యారని, గతేడాదితో పోలిస్తే 1,499 మంది అదనంగా చేరారని చెప్పారు. ఇది 4.82 శాతం పెరుగుదల అని వివరించారు. కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, జడ్‌పిహెచ్‌ఎస్, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యా సంస్థలపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టు కునేలా నాణ్యమైన విద్య, అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.విద్యార్థుల అభ్యసన సామ ర్థ్యాలను మెరుగుపరచడంతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగడం ప్రజల్లో ప్రభుత్వ విద్యా వ్యవస్థపై విశ్వాసం పెరుగుతోందని, రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలవడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు.

# నేడు నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరా అంతరాయం

**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహణ పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. అల్కాపురి ఫీడర్‌లో చెట్టు కొమ్మల తొలగింపు పనుల కారణంగా ఉదయం 9 నుండి 11 గంటల వరకు, ఉజ్వల పార్క్ ఫీడర్‌లో కొత్త డి.టి.ఆర్ పనుల కారణంగా మధ్యాహ్నం 12 నుండి 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. సి.సి. ఫీడర్‌లో లైన్ నిర్వహణ పనుల కారణంగా ఉదయం 8 నుండి 10 వరకు సరఫరా ఉండదు. ఆసిఫ్ నగర్, బావుపేట లైన్లలో నిర్వహణ పనుల కారణంగా ఉదయం 9 నుండి 11 వరకు, సమ్మక్క గద్దెలు ఫీడర్‌లో చెట్ల తొలగింపు పనుల కారణంగా ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# అర్హులైన నిరుపేదల నుంచి పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ



**సుల్తానాబాద్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన నిరుపేదల నుంచి పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ గాజుల రాజమల్లయ్య, 9వ వార్డు కౌన్సిలర్ తొర్రికొండ ప్రభాకర్ మున్సిపల్ సిబ్బందితో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి దరఖాస్తులను స్వీకరించారు.ప్రజల వద్దకే వచ్చి దరఖాస్తుల ప్రక్రియ చేపడుతుండటంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటుందని కౌన్సిలర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంపత్, శ్రీకాంత్, హరీష్, మెంగాని శ్రీనివాస్, నల్లవెల్లి రాజమౌళి, ఆసిఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిశీలన



**కరీంనగర్, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజగోపాల్ రావు వీణవంక మండలంలోని వెల్ది, చెల్లూరు, వీణవంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు.ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టర్, ఎన్‌సిడి రిజిస్టర్, ఫార్మసీ స్టోర్స్, టీకాల నిల్వలు, ఐఎల్ఆర్ టెంపరేచర్ రికార్డులను పరిశీలించారు. పేషంట్లకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ స్థాయిలో సర్పంచ్, వార్డు సభ్యులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు కలిసి ప్రతి వారంలో సమావేశాలు నిర్వహించి ఫీవర్ సర్వే, మెడికల్ క్యాంపులు, డ్రై డే కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.గర్భిణీల చెకప్స్, అభా కార్డుల సృష్టి, 13 ఏళ్లు పైబడిన వారందరికీ రీస్క్రీనింగ్, 14 ఏళ్లు నిండిన బాలికలకు హెచ్‌పివి వ్యాక్సినేషన్ చేయాలని సూచించారు. పాము కాటు, కుక్కకాటు మందులు నిల్వ ఉంచాలని, సిబ్బంది సెలవులు ముందస్తుగా పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ వరుణ, డాక్టర్ బియ్య బని, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
బుధవారం, ఆగస్టు 12, 2026



## రబీ సాగులో ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలి



నందికొట్కూరు, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నాగటూరు, కొణిదెల గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రబీ సీజన్‌లో వరి పంటకు నీరు అందకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలకు మారాలని వ్యవసాయ శాఖ అధికారి షేక్షావల్లి సూచించారు. ఎల్ నినో పరిస్థితులు, వర్షాభావం నేపథ్యంలో ఇప్పటికే వేసిన పంటలను రక్షించుకోవడం, ఇంకా పంటలు వేయని రైతులు వర్షాభావాన్ని తట్టుకునే పంటలను ఎంచుకో వాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై కరపత్రాల పంపిణీ



నందికొట్కూరు, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : జూపాడుబంగ్లా గ్రామంలోని ఎస్సీ కాలనీలో "కూటమి ప్రభుత్వం 2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి -- సంక్షేమం" కార్యక్రమంలో నంది కొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన నాగమ్మను పరామర్శించిన సురేంద్రనాథ్ రెడ్డి



నందికొట్కూరు, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నందికొట్కూరు మండలం మల్యాల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు దండుగుల బాలమద్దయ్య భార్య దండుగుల నాగమ్మ ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని పరామర్శించారు.

## ఘనంగా ఆషాఢ మాస గోరింటాకు పండుగ



నల్లగొండ, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):తెలుగు సంస్కృతిలో ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం అత్యంత ప్రాచీనమైన, ఆరోగ్యకరమైన ఆచారం. వర్షాకాలం ఆరంభంలో వాతావరణ మార్పుల వల్ల శరీరంలో చేరే ఉష్ణాన్ని, వాత దోషాలను తగ్గించడంలో గోరింటాకు అద్భుతంగా పనిచేస్తుందని పెద్దలు చెబుతారు. మహిళలు దీన్ని సౌభాగ్యానికి ప్రతీకగా చేతులకు పెట్టుకుంటారు. నల్లగొండ పట్టణంలోని 33వ వార్డు ఓల్డ్ వీటీ కాలనీలో మహిళలు ఆషాఢ మాస గోరింటాకు పండుగను ఘనంగా జరుపుకున్నారు. అందరూ ఒక్కచోట చేరి గౌరమ్మకు పూజలు చేసి, అనంతరం గోరింటాకు పెట్టుకుని ఆనందంగా సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కుంభం జ్యోతి, ఉమా, విజయ, సరిత, మంజుల, శోభ, సునీత, వినోద, మంగ, లావణ్య, పద్మ, జయశ్రీ, శ్వేత, ఝాన్సీ, నీరజ, అనిత తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

## తీదేడు గ్రామంలో నూతన పింఛన్లకు దరఖాస్తులకు ఆహ్వానం



దేవరకొండ, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు నూతన పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి అర్హుడు ప్రయోజనం పొందేలా చర్యలు తీసుకుంటామని, అవసరమైన ధ్రువపత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు. "ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ సంక్షేమ ఫలాలను పొందండి" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్‌లు ధరణిపతి రమణారావు, ఉలుపాల శేఖర్ రెడ్డి, గ్రామస్తులు సిమర్ల శ్రీను యాదవ్, వీరమల్ల వెంకటయ్య, మొరుపోజు లక్ష్మిపతి, కలగోని మల్లయ్య, మర్ల బచ్చయ్య, వీరమల్ల యాదయ్య, మునగాల రవి, మునగాల అశోక్, బృంగి వెంకటేశం, యాతం రామలింగమ్మ, సోనగంటి ఉమా తదితరులు పాల్గొన్నారు.

## తీదేడు గ్రామంలో వృద్ధాప్య పింఛన్లపై బీఆర్ఎస్ నిరసన



చింతపల్లి, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):అర్హులైన వృద్ధులకు వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని తీదేడు గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సోనగంటి గోవర్ధనాచారి విమర్శించారు. ఆయన మాట్లాడుతూ, "వృద్ధులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. వయస్సు మీదపడిన వారికి పింఛన్ ఎంతో ఆసరాగా ఉంటుంది. అర్హత ఉన్న ప్రతి వృద్ధుడికి ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పింఛన్ మంజూరు చేయాలి" అని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి, మద్రు రామారావు, ఉలుపాల పురుషోత్తం రెడ్డి, సిమర్ల శ్రీను యాదవ్, జూలురు శ్రీధర్, దాసరి ముత్తయ్య, రెడ్డి పరమేష్, మునగాల అశోక్, పంబాల చంద్రయ్య, కలగోని కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య, విద్య రంగాల్లో అగ్రస్థానంలో పెద్దపల్లి జిల్లా - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ఇటీవల మంత్రి హోదా పొందిన సందర్భంగా సన్మానించిన సర్పంచులు




ఎలిగేడు సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు.

ఎలిగేడు, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పెద్దపల్లి జిల్లా వైద్య, విద్య రంగాల్లో రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. ఎలిగేడు మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్ రావు అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెండున్నరేళ్లలో వైద్య సేవలకు 11 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో గతంలో నెలకు 30 డెలివరీలు జరిగేవని, ఇప్పుడు 200 వరకు పెరిగాయని, శిశువుల వైద్యానికి 2 కోట్లతో ప్రత్యేక సదుపాయాలు కల్పించామని వివరించారు. విద్యారంగంలో గత ప్రభుత్వ కాలంలో జిల్లా 31వ స్థానంలో ఉండగా, ఇప్పుడు మూడో లేదా నాలుగో స్థానంలో ఉందని, ప్రభుత్వ పాఠశాలల్లో భవనాలు, ప్రహరీ గోడలు, మౌలిక వసతుల కోసం 50 కోట్లకు పైగా ఖర్చు చేశామని చెప్పారు. రైతులకు యూరియా, కాంప్లెక్స్ ఎరువుల కొరత లేదని, వానకాలం పంటలకు అవసరమైతే ఎస్సారెస్పీ నుండి నీరు అందించేలా కృషి చేస్తామని తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి 10 కోట్ల 80 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఐదు కోట్లను మహిళా సంఘాలు, అంగన్వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అసైన్డ్ భూముల సాగుకు ఎరువులు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచులు ప్రస్తావించగా, సమస్య పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. జడ్పీ సీఈవో నరేందర్ మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రణాళికలు రూపొందించి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని సూచించారు. 45 రోజులకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశాలకు తప్పనిసరిగా హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి నరేష్ కుమార్, తహసీల్దార్ యాకన్న, ఏవో ఉమాపతి, ఎంఈఓ నరేంద్ర చారి, మెడికల్ ఆఫీసర్ నిస్సి క్రిస్టిన్, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనిత, సింగిల్ విండో చైర్మన్ సామ రాజేశ్వర్ రెడ్డి, సర్పంచులు కప్పల ప్రవీణ్, బాపయ్య, కొమురయ్య, తిరుపతి యాదవ్, వెంకటేష్ గౌడ్, రజిత లక్ష్మారెడ్డి, రమాదేవి సంపత్, లతా శ్రీనివాస్ గౌడ్, రాధా గంగా జమున, రాయ మల్లు తదితరులు పాల్గొన్నారు.

## యరగండ్లపల్లి గ్రామంలో తాగునీటి సమస్యలపై సర్పంచ్ సంతోష్ యాదవ్ చొరవ



మర్రిగూడ, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): యరగండ్లపల్లి గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టే దిశగా గ్రామ సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ చొరవ చూపుతున్నారు. ఇటీవల మండల స్థాయిలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో గ్రామంలోని నీటి సమస్యలపై ఆయన గళమెత్తి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ ప్రస్తావించిన సమస్యపై స్పందించిన మిషన్ భగీరథ అధికారులు మంగళవారం గ్రామాన్ని సందర్శించి, నీటి సరఫరా పరిస్థితి, రానున్న రోజుల్లో తలెత్తే అవకాశాలు, ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. గ్రామ ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలపై అధికారులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంతోష్ యాదవ్ మాట్లాడుతూ, "సమస్య వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే గుర్తించి పరిష్కార మార్గాలను సిద్ధం చేయడమే నా లక్ష్యం" అని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ ముందుకు సాగుతానని తెలిపారు. ప్రతి కుటుంబానికి సురక్షితమైన తాగునీరు అందేలా అవసరమైన చర్యల కోసం అధికారులతో కలిసి పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. అనంతరం 'హర్ ఘర్ జల్' కార్యక్రమంలో పాల్గొని, నీటి సంరక్షణ, సురక్షిత వినియోగం, ప్రతి ఇంటికీ నీటి సరఫరా లక్ష్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా, వాటి పరిష్కారం కోసం గ్రామంలో క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించడం ద్వారా సర్పంచ్ సంతోష్ యాదవ్ ప్రజా సమస్యల పరిష్కారంపై తన నిబద్ధతను చాటుకుంటున్నారని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

## మహేష్ కుటుంబానికి గోలి శ్రీనివాస్ రెడ్డి చేయూత



**- మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం**
**- ఆపదలో అండగా ఉంటామని భరోసా**

ఆమనగల్లు, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): చేర్యాకర్ గ్రామానికి చెందిన రాములు కుమారుడు మహేష్ ఇటీవల మృతి చెందడంతో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలిచి సహాయ సహకారాలు అందిస్తామని గోలి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మృతుడి కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పారు. అవసరమైన సమయంలో తన వంతు సహాయాన్ని అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు. గ్రామంలో బాధిత కుటుంబాలను ఆదుకోవడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింగం విజయ్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు జోగయ్య, మాజీ సర్పంచులు రామచంద్రయ్య, అంజి నాయక్, మైసయ్య, మాజీ ఎంపీటీసీ భీమయ్య, ఉప సర్పంచ్ కొండల్, మాజీ ఉప సర్పంచ్ నర్సింహతో పాటు పలువురు నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దోర్నకల్--గద్వాల్ రైల్వే లైన్ సర్వే వేగవంతం చేయాలని కేంద్ర మంత్రికి మల్లు రవి విజ్ఞప్తి



కల్వకుర్తి, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):పార్లమెంట్ హౌస్‌లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ను సోమవారం నాగర్‌కర్నూల్ ఎంపీ, తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం కన్వీనర్, కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి కలిశారు. ఈ సందర్భంగా ఆయన దోర్నకల్--గద్వాల్ రైల్వే లైన్కు సంబంధించి వినతిపత్రాన్ని సమర్పించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గం మరియు తెలంగాణలోని చుట్టుపక్కల ప్రాంతాలకు రైలు అనుసంధానం మెరుగుపడితే సామాజిక--ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన నొక్కి చెప్పారు. "ప్రతిపాదిత రైల్వే లైన్ సర్వే/డీపీఆర్‌ను వేగవంతం చేసి త్వరగా మంజూరు చేయాలి" అని మల్లు రవి మంత్రిని కోరారు. రైల్వే మంత్రి ఈ అభ్యర్థనకు సానుకూలంగా స్పందించి, "ఈ డిమాండ్‌ను తగిన విధంగా పరిశీలిస్తాం" అని హామీ ఇచ్చారు.

## కల్వకుర్తి ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్



కల్వకుర్తి, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కల్వకుర్తి 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి రోజూ 350--600 వరకు అవుట్ పేషెంట్లు వస్తున్నారని, మూడు జాతీయ రహదారులు కలిసే కేంద్రంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షుడు బి. ఆంజనేయులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని, అలాగే సివిల్ అసిస్టెంట్ సర్జన్స్, పారామెడికల్, నర్సింగ్ సిబ్బంది ఖాళీ పోస్టులను భర్తీ చేసి పేదలకు నిరంతర వైద్య సేవలు అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వినతిపత్రాన్ని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కల్వకుర్తి ఆర్డిఓ కార్యాలయంలో డీటీ శ్రీనివాసులకు అందజేశామని ఆంజనేయులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు ఏపీ మల్లయ్య, ఎంప్లాయిస్ వాయిస్ పత్రిక ఎడిటర్ వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, తర్నికల్ మాజీ సర్పంచ్ పాండు గౌడ్, సిఐటియు మండల కార్యదర్శి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధర్మ సమాజ్ పార్టీలో చేరిన ఉస్మానియా విద్యార్థి సంతోష్ మహారాజ్



వెల్దండ, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):వెల్దండ మండలంలోని బొల్లంపల్లి గ్రామ పంచాయతీ ఈదమ్మ బండ తండాకు చెందిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు సంతోష్ మహారాజ్ ధర్మ సమాజ్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విశారదన్ మహారాజ్ కండువా వేసి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంతోష్ మహారాజ్ మాట్లాడుతూ, "బహుజన విద్యార్థుల కోసం నిరంతరం పోరాటం చేస్తాను. ధర్మ సమాజ్ పార్టీ, బీసీ--ఎస్సీ--ఎస్టీ జేఏసీ బలోపేతానికి కృషి చేస్తాను. బహుజన రాజ్య స్థాపన కోసం ఉద్యమిస్తాను" అని తెలిపారు.

## పడకల్ గ్రామ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేకు వినతిపత్రం



తలకొండపల్లి, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన సర్పంచ్ డోకురి సునీత ప్రభాకర్ రెడ్డి హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిను కలిసి వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు పుట్టిన గ్రామం పడకల్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని ఆమె కోరారు. గ్రామంలో ఆయన విగ్రహం, ఆడిటోరియం ఏర్పాటు చేయాలని, అలాగే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామానికి అవసరమైన ప్రధాన పనులలో అండర్ డ్రైనేజ్ వ్యవస్థ, సీసీ రోడ్లు, వీధి లైట్లు, వెటర్నరీ హాస్పిటల్, గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం ఉన్నాయి. అదనంగా, పడకల్--పెద్దూరు గేట్ వరకు, అలాగే తలకొండపల్లి--పడకల్--రాయిచేడ్ వరకు బీటీ రోడ్లు మంజూరు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిల్ శ్రీనివాస్ గౌడ్, పడకల్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



ఎలిగేడు, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మండలంలోని దూళికట్ట గ్రామపంచాయతీలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి విజన్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 120 మంది గ్రామస్తులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం 20 మంది గ్రామస్తులు కంటి శుక్లాలు (క్యాటరాక్ట్) సమస్యతో బాధపడుతున్నట్లు ఆప్టోమెట్రిస్ట్ రమేష్ తెలిపారు. వారికి అవసరమైన సూచనలు అందజేసి, శస్త్రచికిత్స కోసం తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొమురయ్య, వార్డు సభ్యులు బత్తిని శ్రీనివాస్, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రాకే మస్కా కొట్టి రాత్రికి రాత్రే బోర్డులు మార్చేసి

**హైదరాబాద్ :** భూ కబ్జాలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా నే కొందరు కబ్జాదారులు బురిడీ కొట్టిస్తున్నారు. ప్రజా ఫిర్యాదుల మేరకు ప్రజోపయోగ స్థలాల సంరక్షణకు చర్యలు చేపడుతుంటే రాత్రికి రాత్రే బోర్డులను తొలగిస్తూ కబ్జాలు కొనసాగిస్తు న్నారు. బోడుప్పల్ సర్కిల్ చెంగిచర్లలోని వివిధ కాలనీల్లో ఇటీవల ఈ తరహా ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. రూ.15 కోట్ల స్థలం కొట్టేసేందుకు స్కెచ్ : చెంగిచర్ల జయప్రద కాలనీలో రూ.15 కోట్ల విలువ చేసే 4400 చదరపు గజాలను లే-అవుట్‌లో భాగంగా పార్కు, పాఠశాల, ఆసుపత్రి, దేవాలయం, వాణిజ్య అవసరాల కోసం ఖాళీగా వదిలేశారు. ప్రజోపయోగ స్థలాలు కబ్జాల పాలవుతున్నాయ ని కాలనీవాసులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో హైడ్రా యంత్రాంగం వాటి సంరక్షణకు సూచికలను ఏర్పాటు చేసింది. కాగా హైడ్రా ఏర్పాటు చేసిన కంచెను కబ్జాదారులు తొలగించారు. ఆ ప్రాంతంలో నిర్మాణాలకు తెరలేపారు. దీనిపై హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్



రెడ్డి మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదే కాలనీకి చెందిన ఇద్దరిపై కేసు నమోదయింది. చిన్నక్రాంతి కాలనీలోనూ : చిన్నక్రాంతి కాలనీలోనూ ఇదే తరహా ఘటన చోటు చేసుకుంది. వాణిజ్య స్థలాలను కాపాడేందుకు హైడ్రా సూచిక బోర్డు ఏర్పాటు చేసింది. అయితే వాటిని తొలగించి మరీ నిర్మాణాలు చేపడుతున్నారని కాలనీవా సులు గగ్గోలు పెడుతున్నారు. సర్వే నంబరు 114, 118, 120, 121లోని 1800 చదరపు గజాల చుట్టూ కబ్జాదారులు వాలిపోతున్నారు. సుద్దకుంట వద్ద : బోడుప్పల్ సుద్దకుంట ప్రాం తంలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోనూ 1000 చదరపు గజాలకు చుట్టూ ప్రహరీ నిర్మాణం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. వారిపై కఠిన చర్యలు తప్పవు: ప్రభుత్వ భూములు, కాలనీల్లో ప్రజోపయోగ స్థలాలను కబ్జా చేస్తే ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించేది లేదని హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణకు గురైన పార్కు స్థలానికి హైడ్రా రక్ష : హైదరాబాద్ మహా నగరంలో ప్రభుత్వ ఆస్తులు, చెరువుల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న హైడ్రాకు నగరంలో ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. హైడ్రా మద్దతుగా నగరంలో పలుచోట్ల ర్యాలీలు చేపడుతున్నారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ హైడ్రాకు, కమిషనర్ రంగనాథ్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. తమ ప్రాంతంలో గతంలో ఆక్రమణకు గురైన పార్కు స్థలాన్ని హైడ్రా రక్షించినట్లు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్ల విలువైన భూమిని కాపాడినందుకు రంగనాథ్‌కు కృతజ్ఞతలు చెబుతున్నారు. హైడ్రాకమిషనర్‌కు మద్దతుగా పెద్దఎత్తున నినాదాలు : హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సంఘీభావంగా మస్కి చెరువు పరిరక్షణ కోసం ఇటీవల స్థానికులు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చారు. సాయి గౌతమ్ కాలనీ నుంచి మొదలైన ఆ ర్యాలీ మీదుగా మస్కి చెరువు వరకు ఉత్సాహంగా సాగింది. ఖులీ కుతుబ్‌షా కాలనీ, పెంటయ్య కాలనీలతో పాటు పరిసర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్ల వాసులు, పర్యావరణప్రేమికులు ఆర్యాలీలో పాల్గొన్నారు. 'సేవ్ అండ్ డెవలప్ మస్కి లేక్' అంటూ ప్లకార్డులు పట్టుకుని హైడ్రాకమిషనర్‌కు మద్దతుగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. మన ప్రాంతం, మన పర్యావరణం, భవిష్యత్ తరాల కోసం చెరువులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా వెండి పట్టివేత

**హైదరాబాద్:** శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా వెండి నాణేలు పట్టుబడటం తీవ్ర కలకలం రేపుతోంది. ఢిల్లీ వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడి లగేజీలో సుమారు 7 కిలోల వెండి నాణేలను సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ వెండి నాణేలకు సంబంధించిన బిల్లులు, రసీదులు లేకపోవడంతో ఆ ప్రయాణికుడిని తమ అదుపులోకి తీసుకున్న అధికారులు.. వాటి గురించి విచారణ చేస్తున్నారుఎయిర్‌పోర్టు చెకింగ్ పాయింట్ వద్ద ప్రయాణికులు, వారి లగేజీని సీఐఎస్ఎఫ్ సిబ్బంది తనిఖీ చేస్తుండగా భారీగా ఈ వెండి నాణేలు బయటపడ్డాయి. వాటిపై అనుమానం రావడంతో సిబ్బంది ప్రయాణికుడి బ్యాగ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయగా అందులో భారీ మొత్తంలో వెండి నాణేలు ఉన్నట్లు గుర్తించారు. వాటి బరువు సుమారు 7 కిలోలుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ




వెండి నాణేలు కొనుగోలు చేసినట్లు బిల్లులు గానీ, రసీదులు గానీ లేదా ఇతర ఆధారాలను ఆ ప్రయాణికుడు అధికారులకు చూపించలేకపోయినట్లు తెలుస్తోంది. దీంతో సీఐఎస్ఎఫ్ అధికారులు ఆ నాణేలు ఎక్కడి నుంచి వచ్చాయి. వాటిని ఢిల్లీకి ఎందుకు తరలిస్తున్నారు.. వాటి కొనుగోలుకు సంబంధించిన పత్రాలు ఎందుకు లేవు అనే అంశాలపై ఆరా తీస్తున్నారు.

## వైసీపీ కార్యకర్తలను భయపెట్టలేరు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి





**నందికొట్కూరు, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** వైఎస్ఆర్సీపీ శ్రేణులు అక్రమ అరెస్టులకు భయపడేది లేదని రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తెలిపారు. మంగళవారం నందికొట్కూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా వైసీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తోందని విమర్శించారు. ఈనెల 13న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కర్నూలు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆ పర్యటనను అపూర్వ విజయవంతం చేయాలని సూచించారు. గత వైసీపీ పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని, నందికొట్కూరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు పర్యటనలో పాల్గొనాలని ఆయన దిశానిర్దేశం చేశారు.కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

# జలాశయాలకు తగ్గిన వరద ప్రవాహాలు
# ఇక ఎగువ రాష్ట్రాల్లో కురిసే వానలపైనే ఆశలు

**హైదరాబాద్ :**ఎగువన ఉన్న ఆలమట్టి, నారాయణపుర్ రిజర్వాయర్లు పూర్తి స్థాయి నీటి నిల్వలతో కళకళలాడుతున్నా, వచ్చే నీటిలో సగం కూడా దిగువకు వదలట్లేదు. ఈ నెలలో ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకలలో కురిసే వర్షాలపైనే తెలంగాణలోని ఆయకట్టు భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఆలమట్టిలోకి సోమవారం మధ్యాహ్నం 90 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, ఇందులో సగం కూడా నారాయణ పూర్ ప్రాజెక్టుకు వదలలేదు. 35 వేల క్యూసెక్కులతో జల విద్యుదుత్పత్తి : నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి 35 వేల క్యూసెక్కులు మాత్రమే దిగువకు వదులుతున్నారు. ఆలమట్టిలో 129.72 టీఎంసీలకు గానూ 124.9, నారాయణపూర్‌లో 37.64 టీఎంసీలకు గానూ 37.57 టీఎంసీల నీరు ఉంది. ఈ రెండింటిలో కలిపి ప్రస్తుతం కేవలం ఐదు టీఎంసీలకు లోపే ఖాళీ ఉంది. అయినా 90 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తే 35 వేల క్యూసెక్కులను మాత్రమే బయటకు



వదిలారు. ప్రియదర్శిని జూరాలకు 35 వేల క్యూసెక్కులు వస్తే, దిగువకు జల విద్యుదుత్పత్తి ద్వారా 23 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మరో 5 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోతల పథకాలు, జూరాల కుడి, ఎడమ కాల్వల నుంచి మళ్లిస్తున్నారు. ప్రవాహం పెరిగితేనే పాజెక్టుల్లో కళ : శ్రీశైలం ప్రాజెక్టులో 215.8 టీఎంసీలకు గానూ 182.6 టీఎంసీల నిల్వ ఉంది. 23,445 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండగా, ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్తు కేంద్రం ద్వారా విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు కిందికి విడుదల చేస్తున్నారు. తుంగభద్రలో 105 టీఎంసీలకు గానూ 80 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 42,450 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ఈ సమయంలో అటు ఆలమట్టి, ఇటు తుంగభద్రలోకి ప్రవాహం పెరిగితేనే శ్రీశైలం నిండటంతో పాటు నాగార్జునసాగర్‌లో కూడా నీటి నిల్వలు పెరుగుతాయి. శ్రీరాసాగర్‌లోకి 16 వేల క్యూసెక్కులే : గోదావరిలో కూడా అన్ని రిజర్వాయర్లలోకి ప్రవాహాలు చాలా మేరకు తగ్గాయి. శ్రీరామసాగర్‌లోకి ప్రస్తుతం 16,417 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ప్రస్తుతం 42 టీఎంసీలు ఉండగా, మరో 38.5 టీఎంసీలు వస్తే గానీ ఈ ఎస్సారెస్పీ నిండే అవకాసం లేదు. రిజర్వాయర్ నిండితేనే ఆయకట్టుకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. పూడిక కారణంగా ఎస్సారెస్పీ రిజర్వాయర్ సామర్థ్యం 80.5 టీఎంసీలకు పడిపోయింది. ఎగువన మహారాష్ట్రలోని జలవిద్యుత్తు కేంద్రం ద్వారా విద్యుదుత్పత్తి చేస్తూ జైక్వాడిలో నీటి నిల్వ పూర్తిస్థాయిలో ఉండటంతో వచ్చే 10 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే దిగువన ఉన్న శ్రీరామసాగర్? ప్రాజెక్టుకు వదులుతున్నారు. నిజాంసాగర్‌లోకి 4 వేలు, ఎల్లంపల్లిలోకి 5,800 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది.

# నేడు కల్వకుర్తి ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల బహిరంగ వేలం



**కల్వకుర్తి, ఆగస్టు 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**కల్వకుర్తి ఎక్సైజ్ పరిధిలో స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించి బహిరంగ వేలం నేడు ఉదయం 11 గంటలకు కల్వకుర్తి ఎక్సైజ్ స్టేషన్‌లో నిర్వహించబడుతుందని ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి తెలిపారు.ఆసక్తి గల బిడ్డర్లు నిర్ణీత సమయానికి ఎక్సైజ్ స్టేషన్‌కు హాజరై వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

# రిటైర్డ్ ఆర్మీ జవాన్ మృతి కేసులో నలుగురి అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్టు11:** హైదర్ షాకోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ మృతి కేసులో నలుగురిని అరెస్ట్ చేశామని నార్సింగి ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రమాదానికి కారణమైన కారు ఓనర్ శంషాబాద్‌కు చెందిన క్రాంతి గౌడ్‌గా గుర్తించినట్లు తెలిపారు. మంగళవారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ.. హైదర్ షా కోటలోని తన అత్తగారింటికి బోనాల పండుగ సందర్భంగా అతడు వచ్చారని చెప్పారు. తన బావమరిది వికాస్ గౌడ్‌తో కలిసి పార్టీ చేసుకున్నారని అన్నారు. అనంతరం తెల్లవారుజామున టిఫిన్ చేద్దామని లంగర్ హౌస్ వైపు వారంతా కారులో అతి వేగంగా బయలుదేరారని పేర్కొన్నారు.ఆ క్రమంలోనే రిటైర్డ్ ఆర్మీ జవాన్ రవీందర్‌తోపాటు బైక్‌ను




కారుతో ఢీకొట్టారని తెలిపారు. అయితే రవీందర్ అక్కడికక్కడే మరణించగా.. బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారని చెప్పారు. ఈ కేసులో పట్టుబడిన నలుగురికి బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేశామన్నారు. వీరంతా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయిందన్నారు. అలాగే వీరికి డ్రగ్స్ పరీక్షలు కూడా నిర్వహించగా.. నెగిటివ్ వచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రమాదానికి కారణమైన వీరిపై 204 పార్ట్ 4 ఐపీసీతోపాటు మోటార్ వెహికల్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి అమాయకుల ప్రాణాలు తీయొద్దని ప్రజలకు నార్సింగ్ ఇన్‌స్పెక్టర్ విజ్ఞప్తి చేశారు. సోమవారంతెల్లవారు జామున హైదర్ షాకోట్ ఎస్ఎంపీ స్కూల్ సమీపంలో మహేంద్ర ఎస్‌యూవీ 350 కారు బీభత్సం సృష్టించింది. రోడ్డు పక్కన వెళ్తున్న పాదచారులపైకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి రవీందర్ గాలిలోకి ఎగిరిపడి అక్కడికక్కడే మరణించారు. అనంతరం బైక్ మీదకు కారు వెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ తర్వాత కారులో వారంతా పరారీ అవుదామనుకున్నారు. కానీ కారు ముందుకు కదల్లేదు. దీంతో కారు వదిలి వారంతా అక్కడి నుంచి పరారైయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరున్నారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. రవీంద్ర మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలోని సీసీ టీవీ కెమెరాలను జల్లెడ పట్టిన పోలీసులు.. నిందితులను అరెస్ట్ చేశారు. కారు రాంగ్ రూట్‌లో రావడంతోపాటు వారంతా మద్యం తాగి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

# ఖమ్మం రూరల్ ఓటర్లు 84,855

## -- సర్ తో 9,963 ఓట్లు గల్లంతు



**ఖమ్మం రూరల్, ఆగస్టు 11 :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ అనంతరం ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీతో కలిపి మొత్తం 84,855 మంది ఓటర్లు ఉన్నట్లుగా తేలింది. మంగళవారం ఉదయం 10 గంటల వరకు సంబంధిత ఎన్నికల అధికారుల గణాంకాల ప్రకారం ఈ వివరాలు తెలిసింది. పాలేరు నియోజకవర్గంలో సర్ ప్రక్రియకు సంబంధించి జిల్లాలోనే అగ్రస్థానంలో ఉంది. మొత్తం ఓటర్లలో 92.19 % ఓట్ల నమోదు పూర్తి అయింది. గతంలో ఉన్న ఖమ్మం రూరల్ మండల పరిధిలో మొత్తం ఓటర్లు 94,818 మంది ఓటర్లు ఉండగా ఓటర్ జాబితా సవరణ సర్ ప్రక్రియ అనంతరం 84,855 మంది ఓటర్లుగా నిర్ధారణ అయింది. ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలంతో కలిపి మొత్తం పోలింగ్ స్టేషన్‌లో 101 గా ఉన్నాయి.సర్ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. తాజా గుణాంకాల ప్రకారం 9,963 ఓట్లు గల్లంతు అయ్యాయి. వీటిలో 2,057 మంది ఓటర్లు చనిపోయినట్లుగా నిర్ధారణ కాగా మరో 7,203 ఓట్లు తమ సొంత ప్రాంతాలకు పర్మినెంట్ షిఫ్ట్‌గా నమోదైనట్లు తెలుస్తుంది. మరికొందరు ఎనిమిరేషన్ ఫారాలను అధికారులకు ఇవ్వకపోవడంతో మొత్తంగా సుమారు 10 వేల ఓట్లు తొలగించబడ్డట్టు తెలుస్తుంది. పూర్తి ప్రక్రియ అనంతరం ఈ గణాంకాలలో స్వల్ప మార్పులు చోటుచేసుకునే అవకాశం కనబడుతుంది.

# పచ్చని అడవుల్లో సరికొత్త అధ్యాయం..
# 50ఏళ్లలో తొలిసారి అక్కడ రెపరెపలాడిన త్రివర్ణం!

**ములుగు జిల్లా :**కర్రెగుట్టల్లో చరిత్రాత్మక అడుగు పడింది. ప్రకృతి అందాలకు ఆలవాలం.. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన కొండలు కలిగి న కర్రెగుట్టలపైకి చేరుకున్న రాష్ట్ర డీజీపీ జిఎం ఆనంద్ ఈ గుట్టలకు ప్రశాంతత లభించి ందని పరవశించి పోయారు. నిత్యం రక్తం పారిన చోట.. తుపాకులు గర్జించిన బాటలో శాంతి కపోతాలను గాలిలోకి ఎగురవేసి ఇది చరిత్రలో నిలిచిపోయే రోజని ప్రకటించారు తెలంగాణ చత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో మావోయిస్టు కార్యకలాపాలకు ఒకప్పుడు కీలక స్థావరంగా, అత్యంత సున్నితమైన ప్రాంతంగా పేరొందిన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని కర్రెగుట్టల్లో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ పర్యటించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొట్ట మొదటిసారి ప్రభుత్వ అధికారుల బృందం అధికారికంగా కర్రెగుట్టలపైకి రావడం ఇదే తొలిసారి అని డీజీపీ పేర్కొన్నారు. కర్రెగుట్టల్లో డీజీపీ పర్యటన సాహస యాత్రల సాగింది.పర్వతారోహణంలో తెలంగాణలో ఎత్తైన కొండ డోలిగుట్ట.. 964 మీటర్ల ఎత్తులో ఉన్న డోలిగుట్ట కర్రెగుట్టలో ఒక





భాగం. ఎత్తైన కొండలు.. మారుమూల ప్రాంతం కావడంతో గతంలో కర్రెగుట్టలు మావోయిస్టులకు సురక్షిత ప్రాంతంగా ఉండేవి. మావోయిస్టులు ఈ ప్రాంతాన్ని షెల్టర్ జోన్‌గా ఉపయోగించు కోవడంతో పాటు డెన్‌లను ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు సాగించే వారుగతంలో గ్రేహౌండ్స్, కోబ్రా, దళాలు కర్రెగుట్టల్లో కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించి తిరిగి వెళ్లేవి తప్ప ప్రభుత్వ అధికారుల బృందం గుట్టల పైకి రావడం ఇదే ప్రథమం అని డీజీపీ సీవీ ఆనంద్ గుర్తుచేశారు. అయితే గత రెండేళ్లలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బలగాలు, కేంద్ర భద్రతా బలగాల సమన్వయంతో నిర్వహించిన ఖగార్ ఆపరేషన్లతో కర్రెగుట్టల్లో మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గిందని ఆయన తెలిపారు. మావోయిస్టు నాయకత్వంలోని కీలక నేతలు, దళ సభ్యులు లొంగిపోవడం, కొందరు ఆపరేషన్లలో మృతి చెందడం, మరికొందరు ఆయుధాలు వదిలి ప్రభుత్వానికి లొంగిపోవ డంతో ఈ ప్రాంతంలో ప్రశాంత వాతావరణం ఏర్పడిందని డీజీపీ అన్నారు. కర్రెగుట్టల్లో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొంది.. ఇంతకాలం భద్రతా కారణాలతో దూరంగా ఉన్న ప్రాంతంలో ఇప్పుడు అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి.. "కర్రెగుట్టలపైకి ములుగు జిల్లా కలెక్టర్ ఇతర అధికార బృందంతో కలిసి చేరుకున్న డిజిపి శాంతి కపోతాలు పావురాలను ఎగురవేశారు.. జాతీయ జెండాను ఆవిష్కరించి ఆనందంతో మురిసిపోయారు. అధికారులతో కలిసి జాతీయ జెండా ఎగురవేయడం ఎంతో గర్వంగా ఉందని. ఇది చరిత్రలో నిలిచిపోయే రోజని డీజీపీ తెలిపారు. కర్రెగుట్టల ప్రాంతానికి రాకపోకలు సులభతరం చేసేందుకు గత ఆరు నెలలుగా అధికారులు తీవ్రంగా శ్రమించారు. వెంకటాపురం మండలంలోని పామునూరు, మురుమూరు, జల్లా, డోలి, తడపాల వరకు సుమారు 33 కిలోమీటర్ల తెలంగాణ సరిహద్దులో వబీటీ రోడ్డు నిర్మించే దిశగా చర్యలు తీసుకుంటామని డీజీపీ వెల్లడించారు. రహదారి సౌకర్యం అందుబాటులోకి వస్తే రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ సేవలు కూడా సులభంగా చేరే అవకాశం ఉందన్నారు.

# జురెల్‌కు బదులు సర్ఫరాజ్ ఖాన్‌ను ఆడించాలి

## టీమిండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్



రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో జరిగే తొలి మ్యాచ్‌లో ధ్రువ్ జురెల్‌కు బదులు సర్ఫరాజ్ ఖాన్‌ను ఆడించాలని టీమిండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ సూచించాడు. ధ్రువ్ జురెల్ కంటే కూడా సర్ఫరాజ్ ఖాన్‌కు స్పిన్ బౌలింగ్‌ను అలవోకగా ఆడుతాడని అభిప్రాయపడ్డాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027లో భాగంగా రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటన వెళ్లిన సంగతి తెలిసిందే. శనివారం(ఆగస్ట్ 15) గాలే వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. ఇప్పటికే శ్రీలంకకు చేరి వామప్ మ్యాచ్ ఆడిన టీమిండియా ఈ సిరీస్ కోసం అన్ని విధాల సిద్ధమైంది. తొలి టెస్ట్ నేపథ్యంలో తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన కైఫ్.. తన తుది జట్టు అంచనాను వెల్లడించాడు. ధ్రువ్ జురెల్‌కు బదులు సర్ఫరాజ్ ఖాన్‌ను ఎంచుకున్నాడు. 'సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ధ్రువ్ జురెల్‌కు తుది జట్టులో అవకాశం కల్పిస్తారేమో. అతను నిలకడగా రాణించనప్పటికీ.. జట్టులో భాగమని భావిస్తే మాత్రం సర్ఫరాజ్ ఖాన్‌కు నిరాశే ఎదురవుతుంది. అతను అవకాశం కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. కానీ నా అభిప్రాయం ప్రకారం ధ్రువ్ జురెల్‌కు బదులు సర్ఫరాజ్ ఖాన్‌ను ఆడించాలి. ఎందుకంటే.. ధ్రువ్ జురెల్ కంటే సర్ఫరాజ్ ఖాన్ స్పిన్ బాగా ఆడుతాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో పిచ్ కండిషన్స్ అర్థమయ్యే కొద్దీ సర్ఫరాజ్ ఖాన్ రకరకాల షాట్స్ ఆడుతూ తనదైన శైలిలో బ్యాటింగ్‌ను కొనసాగించగలడు. ముఖ్యంగా ఉపఖండపు పిచ్‌ల్లో ఆట నాలుగో లేదా ఐదో రోజు వచ్చేసరికి పరిస్థితులు పూర్తిగా స్పిన్‌కు అనుకూలంగా మారిపోతాయి. ఇలాంటి కండిషన్స్‌లో బ్యాటింగ్ చేయడం కష్టంగా మారుతుంది. అప్పుడు సర్ఫరాజ్ ఖాన్ జట్టుకు బాగా ఉపయోగపడగలడు. అతను స్వీప్, రివర్స్ స్వీప్, ఎక్స్‌ట్రా కవర్స్, బ్యాక్‌ఫుట్ ఇలా ఏ షాటైనా స్పిన్ బౌలింగ్‌లో ఆడగలడు. మరోవైపు జురెల్ ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. వామప్ మ్యాచ్‌లోనూ అతను రెండు ఇన్నింగ్స్‌ల్లో 18 పరుగులు మాత్రమే చేశాడు.'అని కైఫ్ చెప్పుకొచ్చాడు. తన జట్టులో కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్‌లను ఓపెనర్‌గా ఎంపిక చేసిన కైఫ్.. దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్‌లతో పాటు సర్ఫరాజ్ ఖాన్, రవీంద్ర జడేజాలను మిడిలార్డర్ బ్యాటర్లుగా ఎంచుకున్నాడు. మానవ్ సుతార్, సారాన్ష్ జైన్‌లో ఒకరికి అవకాశం దక్కుతుందని, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ స్పెషలిస్ట్ బౌలర్లుగా బరిలోకి దిగుతాడని అంచనా వేసాడు.

# కోహ్లీపై మాజీ ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ ప్రశంసల జల్లు

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై మాజీ ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ ప్రశంసల జల్లు కురిపించాడు. విరాట్ కోహ్లీ జట్టులో ఉంటే ఆటగాళ్లందరికీ పునకాలేనని చెప్పాడు. సహచర ఆటగాళ్లపై కోహ్లీ ప్రభావం తీవ్రంగా ఉంటుందని చెప్పాడు. అతని కారణంగా చుట్టూ ఉన్న ఆటగాళ్లు కూడా మైదానంలో మరింత ఎఫెర్ట్ పెడుతారని తెలిపాడు. బ్యాటింగ్‌లోనే కాకుండా ఫీల్డింగ్‌లోనూ కోహ్లీ తోపేనని చెప్పాడు. టీమిండియా ఫీల్డింగ్ కోచ్ బాధ్యతల నుంచి టీ దిలీప్ ఇటీవలే తప్పుకున్న సంగతి తెలిసిందే. విరాట్ కోహ్లీ సారథ్యంలోనే 2021లో ఫీల్డింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన టీ దిలీప్ ఐదేళ్లు సేవలందించాడు. ఇంగ్లండ్ టూర్ అనంతరం అతని కాంట్రాక్ట్‌ను పొడిగించేందుకు బీసీసీఐ నిరాకరించింది. దాంతో టీ దిలీప్‌కు ఉద్వాసన తప్పలేదు. తాజాగా జియోస్టార్ షోలో మాట్లాడిన టీ దిలీప్.. కోహ్లీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మ్యాచ్ ఆడుతున్నా.. ట్రైనింగ్ సెషెన్స్‌లో పాల్గొన్నా ఒకే ఇంటెంట్ చూపిస్తాడని తెలిపాడు. ట్రైనింగ్ సెషన్స్‌లో కూడా డైవ్ చేస్తూ బంతులను అడ్డుకుంటాడని దిలీప్ వెల్లడించాడు. 'విరాట్ కోహ్లీ.. ఇంటెన్సిటీ విషయంలో ఏ మాత్రం రాజీపడడు. పవర్‌ప్లేలో అతని ఆట తీరును మీరు చూసే ఉంటారు. బ్యాటర్‌గా అతను ఎలా ఉంటాడో.. కవర్ లేదా షార్ట్ మిడ్ వికెట్‌లో అతను ఫీల్డింగ్ చేసే తీరు కూడా అద్భుతంగా ఉంటుంది. ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లోనూ విరాట్ కోహ్లీ చాలా చురుకుగా డైవ్స్ చేస్తూ ఫీల్డింగ్ చేశాడు. తన ఆటతీరుతో ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకొస్తాడు. కెరీర్ చివరి దశలో ఉన్నా కూడా డెత్ ఓవర్లలో మైదానం చుట్టూ పరుగెడుతాడు. సర్కిల్ బయటకు ఫీల్డింగ్ విస్తరించినప్పుడు పరుగెత్తే తొలి ఆటగాడు అతనే. జట్టు కోసం అతను చూపించే ఇంటెండ్ అమోఘం. మైదానంలో అతని ప్రవర్తన నన్ను విపరీతంగా ఆకట్టుకుంటుంది. బంతి దగ్గరగా ఉన్నప్పుడే కాకుండా దూరంగా ఉన్నప్పుడు కూడా రియాక్ట్ అవుతుంటాడు. బంతి ఎప్పుడూ తన చేతుల్లోనే ఉండాలని కోరుకుంటాడు. విరాట్ కోహ్లీ ఆట తీరు.. ప్రాక్టీస్ సెషన్స్, మ్యాచ్‌ల్లోనూ ఒకేలా ఉంటుంది. అతనితో కలిసి ఆడుతున్నప్పుడు ఇతర ఆటగాళ్లు కూడా ప్రభావితమవుతారు. మైదానంలో మరింత ఎఫెర్ట్ పెట్టే ప్రయత్నం చేస్తారు. జట్టులో విరాట్ కోహ్లీ తీసుకువ్చే ప్రభావం అలాంటిది.'అని దిలీప్ కొనియాడాడు.





# పంత్‌కు అండగా మహమ్మద్ కైఫ్

పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ అండగా నిలిచాడు. ప్రస్తుతం రిషభ్ పంత్ గడ్డు కాలం ఎదుర్కొంటున్నాడని, భారత టీ20, వన్డే జట్లలో చోటు కోల్పోయాడని తెలిపాడు. కానీ టెస్ట్‌ల్లో రిషభ్ పంత్‌కు తిరుగులేదని, శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో పంత్ రాణిస్తాడని కైఫ్ విశ్వాసం వ్యక్తం చేశాడు. రెండేళ్ల క్రితం భారత్ తరఫున చివరి అంతర్జాతీయ వైట్ బాల్ మ్యాచ్ ఆడిన రిషభ్ పంత్.. వరుసగా రెండు ఐపీఎల్ సీజన్లలో దారుణంగా విఫలమయ్యాడు. రూ.27 కోట్ల భారీ క్యాష్ ప్రైజ్ ట్యాగ్ రిషభ్ పంత్‌పై అనవసర ఒత్తిడిని తీసుకొచ్చింది. రిషభ్ పంత్ వైఫల్యంతో లక్నో సూపర్ జెయింట్స్ రెండు సీజన్లలో పేలవ ప్రదర్శన కనబర్చింది. దాంతో ఆ జట్టు కెప్టెన్సీ బాధ్యతల నుంచి రిషభ్ పంత్ తప్పుకున్నాడు. వైట్ బాల్ క్రికెట్‌లో విఫలమైనా రెడ్ బాల్ క్రికెట్‌లో పర్వాలేదనిపించాడు. శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు రిషభ్ పంత్ గురించి మాట్లాడిన కైఫ్.. ఇప్పటికీ సుదీర్ఘ ఫార్మాట్‌లో అతను గొప్ప ఆటగాడేనని అభిప్రాయపడ్డాడు. అయితే తనపై నిరంతరం ప్రతికూల వార్తలు వస్తుండటం వల్ల 28 ఏళ్ల రిషభ్ పంత్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నాడని తెలిపాడు. అతనికి జట్టు మద్దతుగా నిలవాలని కోరాడు.'రిషభ్ పంత్‌ను ఇతర ఫార్మాట్లకు పరిగణనలోకి తీసుకోవడం లేదు. అతను వన్డేలు ఆడి చాలా రోజులు అయ్యింది. టీ20ల్లో అతని పేరును కూడా పరిశీలించడం లేదు. ఐపీఎల్‌లో కూడా అతను గడ్డు కాలం ఎదుర్కొన్నాడు. ప్రస్తుతం అతని గాశారం ఏ మాత్రం బాలేదు. కానీ టెస్ట్ క్రికెట్‌లో నేను అతన్ని కొంచెం భిన్నంగా చూస్తాను. టెస్ట్ మ్యాచ్‌ల్లో అతను ఏం చేయగలడో పరిగణనలోకి తీసుకొని మద్దతు ఇస్తాను. భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయమైన విజయాలు అందించిన పంత్.. అప్‌కమింగ్ రెండు టెస్ట్‌ల సిరీస్‌లో ఎలా రాణిస్తాడో చూడాలనుకుంటున్నా. అతనిపై చాలా ఒత్తిడి ఉందని తెలుసు. మీడియాలో అతని పేరును సాకూలంగా ప్రస్తావించడం లేదు. అతని గురించి ప్రతికూల చర్చలే జరుగుతున్నాయి. అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రికార్డ్ సాధించిన విషయాన్ని పక్కన పెడితే.. అతని జట్టు దారుణంగా విఫలమై పాయింట్ల పట్టికలో వెనుకంజలో నిలిచింది. దాంతో జనాలు పంత్ గురించి ప్రతికూల చర్చలు చేశారు. కానీ టెస్ట్ క్రికెట్‌లో అతను ఎప్పటికీ గొప్ప ఆటగాడే.'అని కైఫ్ చెప్పుకొచ్చాడు. భారత్ తరఫున ఇప్పటి వరకు 50 టెస్ట్‌లు ఆడిన రిషభ్ పంత్ 43.37 సగటుతో 3557 పరుగులు చేశాడు. ఇందులో 19 హాఫ్ సెంచరీలతో పాటు 8 శతకాలు ఉన్నాయి.

# బంగాల్ క్రికెటర్ అభిషేక్ పోరెల్ అరెస్ట్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) దిల్లీ క్యాపిటల్స్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న బంగాల్ క్రికెటర్ అభిషేక్ పోరెల్‌ను కోల్‌కతా పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఓ వైద్య విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన అత్యాచారం, బెదిరింపులు, దాడి తదితర ఆరోపణల కేసులో అభిషేక్ పోరెల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హుగ్లీ జిల్లా పరిధిలో నమోదైన ఆ కేసులో అభిషేక్ పోరెల్‌ను అరెస్ట్ చేయాలని ఇటీవల కలకత్తా హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు. అయితే హుగ్లీ రూరల్ ఎస్పీ కున్వర్ భూషణ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం, దమ్‌దమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎమామి సిటీలో అభిషేక్ పోరెల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను కోర్టులో హాజరుపరిచారు. ఆ కేసులో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. కర్ణాటకకు చెందిన ఓ వైద్య విద్యార్థిని గత జూన్‌లో హుగ్లీలోని మోగ్రా పోలీస్ స్టేషన్‌లో అభిషేక్ పోరెల్‌పై ఫిర్యాదు చేసింది. తనకు, అభిషేక్ పోరెల్‌కు సుమారు మూడు సంవత్సరాలుగా సంబంధం ఉందని ఆమె పేర్కొంది. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి తనతో శారీరక సంబంధం పెట్టుకున్నాడని ఆరోపించింది. ఇద్దరం కలిసి విదేశాలకు కూడా వెళ్లినట్లు ఫిర్యాదులో తెలిపింది. అయితే గత ఏడాది నుంచి తమ మధ్య విభేదాలు మొదలయ్యాయని ఆమె పేర్కొంది. ఆ తర్వాత పోరెల్ తనకు దూరంగా ఉండటం ప్రారంభించాడని ఆరోపించింది. పెళ్లి చేసుకుంటానని గతంలో చెప్పినప్పటికీ ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోవడానికి నిరాకరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. అభిషేక్ పోరెల్ తనపై దాడి చేశాడని, బెదిరింపులకు పాల్పడ్డాడని వైద్య విద్యార్థిని ఆరోపించింది. అంతేకాకుండా తనను కొంతకాలం నిర్బంధించి, ఆహారం కూడా ఇవ్వకుండా ఒంటరిగా ఉంచాడని ఫిర్యాదులో పేర్కొంది. ఆ కారణంగా తాను శారీరకంగా బలహీనపడటంతో పాటు సరిగ్గా నడవలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపింది. తనకు గాయాలు కావడంతో అత్యవసరంగా వైద్య చికిత్స తీసుకోవాల్సి వచ్చిందని ఆమె ఆరోపించింది. ప్రయాణానికి సంబంధించిన ఏర్పాట్లు ఉన్నప్పటికీ గాయాల కారణంగా వైద్య సహాయం పొందాల్సి వచ్చిందని ఫిర్యాదులో పేర్కొంది. వైద్య విద్యార్థిని ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే అభిషేక్ పోరెల్ ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ వెంటనే అతడిని అదుపులోకి తీసుకోలేకపోయారు. దీంతో బాధితురాలు కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. ఇటీవల కేసును పరిశీలించిన కలకత్తా హైకోర్టు, ఆరోపణలు ఎదుర్కొంటున్న క్రికెటర్‌ను అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించింది. దీంతో పోలీసులు అభిషేక్ పోరెల్ కోసం గాలింపు చేపట్టారు. చివరకు దమ్‌దమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎమామి సిటీలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ కేసులో అత్యాచారం, క్రిమినల్ బెదిరింపులు, దాడి, నిర్బంధం తదితర ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోంది. తనపై వచ్చిన ఆరోపణలను అభిషేక్ పోరెల్ గతంలో ఖండించినట్లు సమాచారం.

# భువనేశ్వర్‌లో కాంటినెంటల్ టూర్

## ఈ నెల 22న 18 క్రీడాంశాల్లో పోటీలు



న్యూఢిల్లీ : భారత అథ్లెటిక్స్‌కు చిరునామాగా మారేందుకు భువనేశ్వర్ మరో అడుగు ముందుకేసింది. గత ఏడాది కళింగ స్టేడియంలో ఇండియన్ ఓపెన్ వరల్డ్ అథ్లెటిక్స్ బ్రాంజ్ లెవల్ టోర్నమెంట్ నిర్వహించగా.. తాజాగా వరల్డ్ అథ్లెటిక్స్ ఈ టోర్నమెంట్ స్థాయిని పెంచింది. దీంతో ఈ ఏడాది ఇక్కడ కాంటినెంటల్ సిల్వర్ లెవల్ టోర్నమెంట్ జరుగనుంది. స్థాయి పెరగటంతో ఇక్కడ పోటీపడిన అథ్లెట్లకు కేటగిరీ బీ పాయింట్లు దక్కనుండగా, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రభావం చూపుతుంది. ఈ నెల 22న జరుగనున్న కాంటినెంటల్ సిల్వర్ లెవల్ టోర్నమెంట్‌లో 18 క్రీడాంశాలకు వరల్డ్ అథ్లెటిక్స్ అనుమతి ఇచ్చింది. పురుషుల విభాగంలో 100మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 5000మీటర్లు, 110మీటర్ల హార్డిల్స్, హై జంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో ఉండనుం డగా.. మహిళల విభాగంలో 100 మీటర్లు, 400 మీటర్లు, 1500 మీటర్లు, 5000మీటర్లు, 100 మీటర్ల హార్డిల్స్, హై జంప్, లాంగ్ జంప్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో ఉండనున్నాయి. గత ఏడాది బ్రాంజ్ లెవల్ టోర్నమెంట్లో ప్రైజ్‌మనీ రూ.25 లక్షలు కాగా.. తాజాగా సిల్వర్ లెవల్ టోర్నమెంట్‌కు ప్రైజ్‌మనీ రూ.75 లక్షలు ఇవ్వనున్నారు. 2028 ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌తో పాటు అదే ఏడాది ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌కు సైతం భువనేశ్వర్ వేదికగా నిలువనున్న సంగతి తెలిసిందే.

**బరిలో స్టార్ అథ్లెట్లు**

భువనేశ్వర్ కాంటినెంటల్ సిల్వర్ లెవల్ టోర్నమెంట్‌లో భారత అగ్రశ్రేణి అథ్లెట్లు పోటీపడనున్నారు. స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా డైమండ్ లీగ్‌లో ఆ నెల 21న పోటీపడనున్నాడు.

దీంతో అతడు ఈ ఈవెంట్‌లో పోటీపడటం లేదు. కామన్‌వెల్త్ క్రీడల్లో పతకాలు సాధించిన మురళీ శ్రీశంకర్, యశ్ వీర్ సింగ్, గుల్వీర్ సింగ్, సీమా కలిరామా, సర్వేశ్‌లు ఇక్కడ పోటీపడనున్నారు. ప్రస్తుతం భారత అథ్లెటిక్స్ బృందం పోలాండ్‌లో శిక్షణ పొందుతుంది. అక్కడ్నుంచి నేరుగా భువనేశ్వర్‌కు చేరుకుని పోటీల్లో పాల్గొంటా రు.

# పళ్ల బురుసు సందేశాత్మక చిత్రం



'పళ్ళ బురుసు' లాంటి మంచి సందేశాత్మక చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నిర్మిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు నిర్మాత సుప్రియ యార్లగడ్డ. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్, గోమతి రెడ్డి ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమాని ఉదయ్ చౌహాన్ తెరకెక్కించారు. ఈ నెల 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుప్రియ మాట్లాడుతూ.. ఏఎన్నార్ ఉండిఉంటే మంచి చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు ప్రశంసించేవారని అన్నారు. 'అందరూ ఎంతో ప్రేమించి తీసిన సినిమా 'పళ్ళ బురుసు'. దీన్ని చూస్తున్నంత సేపూ నవ్వుతూనే ఉన్నా. అదే సమయంలో కన్నీళ్లొచ్చాయి. మనసు బరువెక్కింది. ఇంత మంచి సినిమా చేసినందుకు చాలా తృప్తిగా అనిపించిందని నాగార్జున అన్నారు. . ఆయన అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై మరో నిర్మాత వివేక్ కృష్ణపాణితో కలిసి నిర్మించిన చిత్రమే 'పళ్ళ బురుసు'. అన్నపూర్ణ స్టూడియోస్ 50ఏళ్లు పూర్తి చేసుకుంది. నాన్న ప్రారంభించిన ఈ సంస్థలో ఎన్నో చక్కటి సినిమాలు చేశాం. ఈ 50వ సంవత్సరం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నాం. అన్నపూర్ణ డిస్టిబ్యూషన్‌ని విస్తరించాం. ఇక ఈ చిత్ర విషయానికొస్తే.. తల్లిదండ్రుల్ని మనం చూసుకున్న దానికన్నా అదృష్టం ఇంకేదీ ఉండదు. అది చాలా ముఖ్యం. అలా నా తల్లిదండ్రుల్ని నేను చూసుకున్నా. ఇప్పటికీ అమల కూడా వాళ్ల అమ్మానాన్నల్ని ఎంతో జాగ్రత్తగా చూసుకుంటుంది. ఇందులో శంభు తాతగా సుధాకర్ అద్భుతంగా చేశారు. తన కొడుకు పాత్రలో మురళీధర్ చక్కగా నటించారు. ఈ నెల 14న మా అమ్మ పుట్టినరోజు. అమ్మానాన్నల ఆశీస్సులు ఈ చిత్రంపై ఉంటాయని నా నమ్మకం అన్నారు. కుటుంబంతో కలిసి చూడాల్సిన చిత్రమిది. అందరి మనసుల్ని హత్తుకుంటుంది' అన్నారు దర్శకుడు ఉదయ్. ఈ కార్యక్రమంలో సుప్రియ యార్లగడ్డ, మురళీధర్ గౌడ్, సుధాకర్, గోమతి, పవన్ సీహెచ్, ప్రసాద్, సురేశ్ గంగుల, ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

----



# మోహన్ లాల్ కుమార్తె విస్మయ

## తుడక్కం మూవీతో అరంగేట్రం

మలయాళ యాక్షన్ థ్రిల్లర్ 'తుడక్కం'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు మోహన్ లాల్ కుమార్తె విస్మయ . జూడ్ ఆంటోనీ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన మహిళా ప్రాధాన్యమున్న మలయాళ చిత్రంగా నిలిచింది. బాక్సాఫీస్ నివేదికల ప్రకారం.. 'తుడక్కం' మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 6.8 కోట్లు వసూలు చేసింది. భారత్‌లో 1100ల థియేటర్‌లలో దీన్ని విడుదల చేశారు. ఓవర్సీస్‌లోనూ దీనికి మంచి స్పందన రావడంతో రికార్డు నెలకొల్పింది. మొదటి రోజు భారత్‌లో రూ. 2.55 కోట్లు సొంతం చేసుకుంది. దీంతో అంతకుముందు కల్యాణి ప్రియదర్శన్ నటించిన 'కొత్తలోక' సినిమా తొలిరోజు (రూ. 6.63 కోట్ల) ప్రపంచ వ్యాప్త వసూళ్లను 'తుడక్కం' అధిగమించింది. విస్మయ మోహన్‌లాల్, ప్రముఖ నిర్మాత ఆంటోనీ పెరుంబావూర్ కుమారుడు ఆశిష్ జోస్ ఆంటోనీలకు ఇది తొలి చిత్రం. 'మీను' పాత్రలో విస్మయ ఎంతో సహజంగా నటించగా, ఆశిష్ సైకో పాత్రలో తన నటనతో భయపెట్టారు. సమాజంలో మహిళలు ఎదుర్కొనే వేధింపులు, లైంగిక దాడులు, మనుగడ కోసం ఒక యువతి చేసే పోరాటం నేపథ్యంలో సాగే ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో మోహన్‌లాల్ అతిథి పాత్రలో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# శబరిమలకు సంబంధం లేని ఇరుముడి

## దర్శకుడు శివ నిర్వాణ స్పష్టీకరణ



రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న లేటెస్ట్ ఫ్యామిలీ అండ్ డివోషనల్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా పాటల్లో, టీజర్‌లో రవితేజ అయ్యప్ప మాలలో కనిపించారు. దీంతో ఈ చిత్ర కథపై సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వస్తున్నాయి. శబరిమల బ్యాక్‌డ్రాప్‌లో ఇది రానుందని ప్రచారం మొదలైంది. తాజాగా దీనిపై దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. శబరిమల దేవాలయానికి ఈ సినిమాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ కథకు శబరిమలతో ఎలాంటి సంబంధం లేదు. సినిమాలో కథానాయకుడి జీవితంలో 41 రోజుల అయ్యప్ప దీక్ష ఒక భాగం మాత్రమే. దీక్షా కాలంలో అయ్యప్ప భక్తులు తమ నియమావళి, అలవాట్ల విషయంలో చాలా నిష్టగా ఉంటారు. వ్యసనాలు ఉన్న ఒక వ్యక్తి ఈ దీక్ష తీసుకోవాల్సి వస్తే.. అతడు మద్యానికి దూరంగా ఉండాల్సి వస్తుంది. అక్కడే కథలో అసలైన సంఘర్షణ మొదలవుతుంది. కఠినమైన నియమాలు ఉండాలి కాబట్టే నేను అయ్యప్ప స్వామి దీక్ష నేపథ్యాన్ని ఎంచుకున్నాను. అంతే తప్ప ఇది శబరిమలకు సంబంధించిన కథ కాదని ఆయన పేర్కొన్నారు ఈ 41 రోజుల కథే స్క్రీన్‌ప్లేకి ప్రధాన బలంగా నిలుస్తుంది. అది సినిమాను మరింత ఆసక్తికరంగా మారుస్తుంది. ఆ దీక్షకు ముందు ఏం జరిగింది.. దీక్షలో ఉన్న సమయంలో ఏం జరిగిందనే విషయాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయని శివ నిర్వాణ తెలిపారు. రవితేజకు జోడీగా ప్రియా భవానీ శంకర్ నటిస్తున్న ఈ సినిమా ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు రానుంది

-------

# రుక్మిణీ వసంత్ మలయాళ ఎంట్రీ..



ఒక్క సినిమాతో మంచి సక్సెస్ అందుకున్నారు అంటే అది హీరోకైనా, హీరోయిన్ కైనా వరుసగా అవకాశాలు వచ్చి పడతాయి. అందులో భాగంగానే మరీ ముఖ్యంగా ఈ మధ్యకాలంలో యంగ్ హీరోయిన్స్ తమ అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంటూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. అలాంటి వారిలో రుక్మిణి వసంత్ కూడా ఒకరు. సప్త సాగరాలు దాచేయెల్లో అనే సినిమాతో వెండితెరకు పరిచయమైన రుక్మిణీ వసంత్.. తెలుగులో తొలిసారి నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా నటించిన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనే చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. అయితే ఈ సినిమా పెద్దగా విజయాన్ని అందుకోలేదు. ఆ తర్వాత తమిళ్ లో శివ కార్తికేయన్ సరసన మదరాసి అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా సక్సెస్ కాలేదు. అయితే ఈ సినిమా ప్రమోషన్స్ సమయంలో డైరెక్టర్ ఈమెకు ఇచ్చిన ఎలివేషన్ కారణంగా ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చింది రుక్మిణి వసంత్. సరైన క్యారెక్టర్ పడితే తనను తాను నిరూపించుకోవడానికి ఎప్పుడూ సిద్ధమే అని కాంతారా చాప్టర్ వన్ చిత్రంతో నిరూపించింది. ఇందులో కీలకపాత్ర పోషించిన రుక్మిణి వసంత్.. సినిమా మొత్తం సాఫ్ట్ క్యారెక్టర్ తో ఆకట్టుకొని.. క్లైమాక్స్లో ఒక్కసారిగా విలనిజం కనబరిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. పైగా కొన్ని కొన్ని సన్నివేశాలలో హీరో రిషబ్ శెట్టి నే డామినేట్ చేసింది అంటే.. తన నటనతో ఏ విధంగా మెప్పించిందో అర్థం చేసుకోవచ్చు.అలాంటి ఈమె ప్రస్తుతం ప్రముఖ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న డ్రాగన్ సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇదిలా ఉండగా ఇప్పుడు మరో క్రేజీ ఆఫర్ లభించింది .ఈ విషయాన్ని తన అధికారిక ఇంస్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకుంది. నివిన్ పౌలీ సరసన హీరోయిన్ గా ఛాన్స్ కొట్టేసి.. మాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమయ్యింది. అందులో భాగంగానే ఈమె ఆన్ సెట్ కి వెళ్లిన సందర్భంగా క్లాప్ బోర్డు పట్టుకొని ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. మొత్తానికి అయితే రుక్మిణి వసంత్ మాలీవుడ్ లోకి అడుగుపెట్టడంతో అభిమానులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే తాను ఎంతో కాలంగా అభిమానిస్తున్న మాలీవుడ్ సినీ పరిశ్రమలో అవకాశం లభించడంతో తనకు చాలా ప్రత్యేకంగా అనిపిస్తుంది అంటూ రుక్మిణి చెప్పుకొచ్చింది. ఆ ప్రపంచంలో ఒక చిన్న స్థానం సంపాదించడం తనకు ఒక ముఖ్యమైన తొలి అడుగు అని , ఈ ప్రాజెక్టులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి కూడా ధన్యవాదాలు తెలిపింది. ఈ సినిమాలో నివిన్ పౌలీ హీరోగా నటించడమే కాకుండా తన సొంత బ్యానర్ అయిన పౌలీ జూనియర్ పిక్చర్స్ బ్యానర్ పై మార్టిన్ ప్రాక్కాట్ ఫిలిమ్స్ తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో మలయాళ నటుడు అజు వర్గీస్ కీలక పాత్ర పోషిస్తున్నారు. గతంలో తమలయాల సూపర్ హిట్ కామెడీ మూవీ జయ జయ జయ జయ హే అనే చిత్రానికి సహా రచయితగా పనిచేసిన నషీద్ ఫామీ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు.




# టాక్సిక్ రన్‌టైమ్ పై ఆసక్తికర ప్రచారం

ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో



'టాక్సిక్ ఒకటి. యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'టాక్సిక్' రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. గీతూమోహన్ దాస్ తన కథపై నమ్మకంతోనే ఈ నిడివితో సెన్సార్‌కు పంపారని సమాచారం. ఈ సినిమాను ప్రైమ్ బిగ్ స్క్రీన్ ఫార్మాట్ అయిన ఐమాక్స్‌లో కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. కన్నడ ఇండస్ట్రీ నుంచి ఐమాక్స్ ఫార్మాట్‌లో విడుదలవుతోన్న రెండో సినిమా ఇది కాగా.. రెండు ఐమాక్స్ చిత్రాలను (కేజీఎఫ్ 2, టాక్సిక్) తన ఖాతాలో వేసుకున్న ఏకైక కన్నడ స్టార్‌గా యశ్ రికార్డు సృష్టించారు. త్వరలోనే దేశవ్యాప్తంగా ఐమాక్స్ బుకింగ్స్ కూడా ప్రారంభం కానున్నాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అడ్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

---------------



# కలెక్షన్లలో కనకరాజు దూకుడు

మెగాహీరో వరుణ్ తేజ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా మొదటి వీకెండ్‌లోనే సుమారు రూ. 37 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఇక వీకెండ్ ముగిసిన తర్వాత వచ్చిన మొదటి వర్కింగ్ డే అయిన సోమవారం కూడా ఈ సినిమా తన జోరును ఏమాత్రం తగ్గించలేదు. కఠినమైన 'మండే టెస్ట్'ను ఈ చిత్రం చాలా విజయవంతంగా పాస్ అయింది. విడుదలైన నాలుగో రోజు అయిన సోమవారం ఒక్కరోజే బుక్‌మైషో మరియు డిస్టిక్ట్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా 70 వేలకు పైగా టికెట్లు అమ్ముడవ్వడం విశేషం. దీనివల్ల మొదటి వారపు రోజుల్లోనూ సినిమాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని స్పష్టమవుతోంది. ఇలాగే కలెక్షన్స్ కొనసాగితే రాబోయే రోజుల్లోనూ థియేటర్లలో ఈ చిత్రం హవా మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇదిలాఉంటే, ఈ సినిమా ఘన విజయం సాధించిన సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహిస్తోంది. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ఎస్.ఎస్. థమన్ సంగీతం అందించారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు యువి క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.